ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
పశ్చిమ గోదావరి
జిల్లా వార్తలు
5
బుధవారం 13 నవంబరు 2024





తాకట్టు తంటాలు

- నకిలీ, చోరీల.. బంగారంతో వ్యాపారుల పాట్లు
- రికవరీల పేరిట తరచూ పోలీసు తనిఖీలు
- పెరిగిన మోసాలతో అవస్థలు

జిల్లాలోని కొందరు నకిలీ బంగారం, దొంగతనాలు చేసిన బంగారాన్ని తాకట్టు పెడుతూ వ్యాపారులను మోసం చేస్తున్నారు. ఇటీవల కాలంలో ఈ మోసాలు విపరీతంగా పెరిగాయి. నరసాపురం, భీమవరం, తణుకు, తాడేపల్లిగూడెం, పాలకోడేరు, ఆకివీడు తదితర ప్రాంతాల్లో ఇవి ఎక్కువగా వెలుగుచూశాయి. 7లో..

- మా దారి అడ్డదారి..!



భీమవరం బస్టాండ్ వద్ద నో ఎంట్రీ బోర్డు ఉన్నా.. మమ్మల్ని ఆపేది ఎవరంటూ.. అటుగా వెళుతున్న వాహనచోదకులు.. పట్టించుకోని ట్రాఫిక్ పోలీసులు (ఆంధ్రజ్యోతి-భీమవరం)

దొంగను పట్టించిన చెప్పులు



భీమవరం క్రైం, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): ఓ బ్యాంక్‌లో కన్నం వేసేందుకు రెక్కీ నిర్వహించి, మర్నాడు ప్రయత్నించి విఫలమైన నిందితుడిని అరెస్టు చేసినట్లు భీమవరం డీఎస్పీ ఆర్‌జే జయసూర్య తెలిపారు. మంగళవారం డీఎస్పీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. కాళ్ల మండలం సీసలికి చెందిన పిప్పళ్ళ రాజేష్ చెడు వ్యసనాలకు బానిసయ్యాడు. ఎలాగైనా డబ్బు సంపాదించాలనే ఆశతో గత నెల 7న దొడ్డనపూడికి చెందిన ఓ మహిళ మెడలో బంగారు గొలుసు లాక్కొని పారిపోతుండగా ఆమె ప్రతిఘటించింది. సగం ముక్క లాక్కొని పరారయ్యాడు. గత నెల 24న ఏలూరుపాడు యూనియన్ బ్యాంక్‌కు కన్నం వేసేందుకు రెక్కీ నిర్వహించాడు. మర్నాడు రాత్రి కిటికీ ఊసలు మిషన్‌తో కోసి లోపలికి వెళ్లాడు. ఎలాంటి విలువైనవి దొరకలేదు. 26న బ్యాంక్ మేనేజర్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. ఎస్పీ అద్నాన్ నయీం అస్మి, డీఎస్పీ జయసూర్య, సీఐ జగదీశ్వరావు ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలు గాలింపు చేపట్టాయి. సీసీ ఫుటేజ్‌లో.. ముందురోజు బ్యాంకు వచ్చి పరిశీలించిన వ్యక్తి చెప్పులు, మర్నాడు కిటికీ ఊసలు తొలగించిన వ్యక్తి చెప్పులు ఒకటిగా ఉండటంతో ఆ విధంగా దర్యాప్తు చేపట్టారు. నలుపు రంగు యాక్టివా వాహనాన్ని గుర్తించారు. మంగళవారం నిందితుడు పోలీసులను చూసి పారిపోతుండగా అరెస్టు చేసి 20 వేల నగదు, ఊసల కటింగ్ మిషన్, కటింగ్ బార్, యాక్టివాను స్వాధీనం చేసుకున్నారు. రెండు కేసుల్లో అరెస్టు చేసి కోర్టుకు పంపనున్నట్లు డీఎస్పీ చెప్పారు.

రూ.20 వేలు పంపి రూ.46 లక్షలు కొట్టేశారు -7లో..



జిల్లాలో సోలార్ రూఫ్‌కు 8 వేల దరఖాస్తులు

- నోడల్ విలేజ్‌లుగా మూడు గ్రామాల ఎంపిక : ఈపీడీసీఎల్ ఎస్ఈ రఘునాథ్‌బాబు

నరసాపురం, నవంబరు 12(ఆంధ్రజ్యోతి):పీఎం సూర్య ఘర్ యోజనలో పీఎం లంక(నరసాపురం), ఆగర్తిపాలెం (పాలకొల్లు), కొవ్వాడ(భీమవరం) గ్రామాలను నోడల్ విలేజ్‌లుగా ఎంపిక చేసినట్లు ఈపీడీసీఎస్ ఎస్ఈ రఘునాథ్‌బాబు చెప్పారు. మంగళవారం ట్రాన్స్‌కో ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. సోలార్‌ను ఏర్పాటు చేసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలు, ప్రభుత్వం, బ్యాంకులందించే రుణాలపై వినియోగదారులకు అవగాహన కల్పించారు. ఆయన విలేకర్లతో మాట్లాడుతూ '500 విద్యుత్ కనెక్షన్లు ఉండే ఈ మూడు గ్రామాల్లో నూరు శాతం సోలార్ రూఫ్‌ను ఏర్పాటు చేయాలని ప్రతిపాదించాం. ఈ స్కీమ్ విజయవంతమైతే ఆ మూడు గ్రామాలకు ప్రభుత్వం రూ.కోటి చొప్పున గ్రాంట్ విడుదల చేస్తుంది. కిలోవాట్స్‌కు రూ.30 వేలు, 2 కిలో వాట్స్ రూ.60 వేలు, 3 కిలో వాట్స్‌కు రూ.75 వేలు వినియోగదారుడు చెల్లించాలి. ప్లాంట్ ఏర్పాటు చేసిన తర్వాత సబ్సిడీ వినియోగదారుల ఖాతాల్లో జమవుతుంది. జిల్లాలో సోలార్ రూఫ్‌కు 8 వేల మంది దరఖాస్తులు చేసుకున్నారు. ఇప్పటి వరకు 250 మందికి సబ్సిడీపై సోలార్ ప్లాంట్‌లందించాం. పది రోజుల్లో సర్వే చేసి 245 మందికి ఇస్తాం. ట్రాన్స్‌కో ఈఈ మధుకుమార్ మాట్లాడుతూ సోలార్ ప్లాంట్ ఏర్పాటు చేసుకుని విద్యుత్ బిల్లుల ఖర్చును తగ్గించుకోవచ్చు' అని తెలిపారు. సమావేశంలో డీఈ ఓంకార్, ఏఈలు ప్రభాకరావు, కె.సుధాకర్, సిబ్బంది మునికోటి వెంకటేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

తుఫాన్ టెన్షన్



నీటమునిగిన ఆచంట ప్రధాన రహదారి

అల్పపీడనం.. రైతుల్లో భయం

- మాసూళ్ల వేళ.. భారీ వర్షాలు
- కోతకొచ్చే సమయంలో తిప్పలు
- ధాన్యాన్ని ఒబ్బిడి చేసే పనుల్లో అన్నదాతల పరుగులు

తాడేపల్లిగూడెం రూరల్/పెంటపాడు/ఆచంట, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో అల్పపీడన ద్రోణి రైతులను పరుగులు పెట్టిస్తోంది. ఆరుగాలం కష్టపడి పండించిన పంట కోతలు కోసి అమ్మకానికి పంపే సమయంలో వర్షాలు కురుస్తుండడంతో హడలిపోతున్నారు. కోసిన ధాన్యం చాలా వరకు కళ్లాలపైనే ఉంది. ఎప్పుడు ఏం జరుగుతుందోనని రైతులు కలవరపడుతున్నారు.

ఏటా శాపంగా మారింది

'ఏటా సార్వా సాగులో మాకు ఇది శాపంగా మారింది. ఎకరానికి రూ.30 వేల వరకూ పెట్టుబడులు పెట్టాం. ధాన్యం కోసినందుకు మిషన్‌కు గంటకు రూ.మూడు వేలు చెల్లిస్తున్నాం. సాధారణంగా సార్వాలో దిగుబడి తక్కువ. అయినా ఖర్చులు భరించి సాగు చేస్తుంటే, ప్రకృతి మాపై ఏటా తన ప్రతాపాన్ని చూపుతోంది. ధాన్యం ఆరబెట్టుకునేందుకు కనీసం సరైన కళ్లాలు లేవు. రోడ్ల పక్కన ఆరబెట్టుకోవాల్సి వస్తోంది. ఇప్పటికే తుఫాను ప్రభావంతో భయపడుతుంటే.. ధాన్యాన్ని దళారులు అయినకాడికి అడుగుతున్నారు. మొత్తం పోతే ఇబ్బంది పడతాం. అందుకే కొంచెం నష్టమైనా తప్పని పరిస్థితుల్లో ధాన్యం బయట వ్యక్తులకు అమ్ముకోవాల్సి వస్తోంది' అంటూ రైతులు వాపోతున్నారు. తాడేపల్లిగూడెం మండలం బంగారుగూడెం, వీరంపాలెం, ఆరుగొలను, నవాబుపాలెం, జగన్నాధపురం, తదితర గ్రామాల్లో వరి ధాన్యం రోడ్లపైనే ఉండటంతో ఏం చేయాలో తోచని స్థితిలో మిగిలిపోయారు. కొందరు అవకాశం ఉన్న మేరకు ధాన్యం తూసేయగా మరికొంత ధాన్యం రోడ్లపైనే గుట్టలుగా ఉంచారు. పెంటపాడు మండలంలో చిన్నపాటి వర్షానికి రైతులు బరకాలు తీసుకుని కళ్లాలవైపు పరుగులు తీశారు. వర్షం పెద్దది కాకుండా ఆగిపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. కాని, ఆరబోసిన ధాన్యంపై బరకాలు కప్పుకునేలోగా ధాన్యం తడిచిపోయింది. వర్షం వెలిసిన తర్వాత మళ్లీ ధాన్యం ఎండబెట్టుకున్నారు. ఆచంట మండలంలో సార్వా మాసూళ్ల మొదలయ్యాయి. అల్పపీడనంతో వర్షం పడుతుండటంతో రైతుల్లో ఆందోళన మొదలైంది. మరో వారం రోజుల్లో పూర్తిస్థాయిలో మాసూళ్లు జరిగే అవకాశం ఉంది. ఇవి పూర్తయ్యే వరకు వాతావరణం అనుకూలిస్తేనే సార్వా నుంచి గట్టెక్కుతాం అని రైతులు అంటున్నారు. ఆచంటలో మంగళవారం ఉదయం నుంచి మబ్బులు, మేఘాలతో వాతావరణం నిండి ఉంది. గంటపాటు ఏకధాటిగా కురిసిన భారీ వర్షానికి పల్లపు ప్రాంతాలు, ప్రధాన రహదారులు నీట మునిగాయి. వాహనదారులు పాదచారులు ఇబ్బందులకు గురయ్యారు.

దేవుడా తుఫాన్ దాటించు

- ధాన్యమంతా రోడ్డుకు చేరింది. ఈ సమయంలో తుఫాన్ హెచ్చరికలు మమ్మల్ని మరింత ఆందోళనకు గురి చేస్తున్నాయి. దేవుడా తుఫాన్ దాటించమని వేడుకుంటున్నాం. - పి.శ్రీను, వీరంపాలెం
- ధాన్యమంతా రోడ్డుపైనే ఉంది. ఈ సమయంలో వర్షం పడితే ఆరునెలల కష్టం అంతా నీటిలో మునిగినట్టే. వర్షం వచ్చేలోపు ఈ ధాన్యం మిల్లులకు చేరాలి. లేదంటే మా కష్టం మునిగిపోతుంది. - మాకిరెడ్డి సత్యనారాయణ, బంగారుగూడెం



బరకంతో కప్పిన ధాన్యం రాశి



బంగారుగూడెంలో ధాన్యం బస్తాల ఎగుమతి

ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలి : జేసీ

భీమవరం రూరల్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): 'రైతు భరోసా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలును వేగవంతం చేయాలి. రైతు ఎంపిక చేసుకున్న మిల్లులకు ధాన్యాన్ని పంపే వెసులుబాటుపై రైతులకు అవగాహన కల్పించాలి' అని జిల్లా జాయింట్ కలెక్టర్ టి రాహుల్‌కుమార్‌రెడ్డి ఆదేశించారు. జిల్లా ధాన్యం సేకరణ కమిటీ సభ్యులతో మంగళవారం కలెక్టరేట్‌లో జేసీ సమీక్షించారు. 'ఇప్పటి వరకు ఎంత మంది రైతులు కోత కోశారు. ధాన్యం కళ్లాల్లో ఎంత ఉంది ? ఎస్ఆర్‌కెల ద్వారా ఎంత ధాన్యం కొనుగోలు చేశారు. ప్రైవేటుగా మేరకు అమ్మకాలు సాగాయి' మొదలైన వివరాలు ఆన్‌లైన్‌లో పొందుపరచాలన్నారు. రైతులకు ఏదైనా సమస్య ఎదురైతే జిల్లా కలెక్టరేట్‌లో వివిధ శాఖల సమన్వయంతో ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి కంట్రోల్ రూమ్ నెంబరు 81216 76653లో సంప్రదించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ పేర్కొన్నారు. వివిధ శాఖలు అధికారులు టి.శివరాంప్రసాద్, జెడ్.వెంకటేశ్వరరావు, ఎం.నాగరాజు, పి.ఉమామహేశ్వరరావు, శివశంకర్, జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షులు సామంతపూడి శ్రీరామరాజు తదితరులు పాల్గొన్నారు.

నేతలు.. మేతలు



తీపర్రు ర్యాంపులో ఇసుక ట్రాక్టర్ల క్యూ

- లారీకి అదనంగా రూ.5 వేలు వసూళ్లు
- తీపర్రు ర్యాంప్‌లో ఇదే దందా.. కలెక్టర్ ఆదేశాలు బేఖాతర్
- బిల్లు రూ.2360.. అదనపు సొమ్ములు చెల్లిస్తేనే లోడింగ్
- కాంట్రాక్టర్‌లకు అప్పగించినా నాయకులదే దందా

(భీమవరం-ఆంధ్రజ్యోతి)

టీడీపీ కూటమి ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ఉచిత ఇసుక విధానాన్ని నాయకులు అభాసుపాలు చేస్తున్నారు. ర్యాంప్‌ల్లో తవ్వకాలను ప్రైవేటు కాంట్రాక్టర్లకు అప్పగించినా ఫలితం లేకపోతోంది. పశ్చిమ గోదావరి జిల్లాకు తీపర్రు ర్యాంప్‌తో పాటు, ఔరంగాబాద్ రీచ్‌ను కేటాయించారు. లోడింగ్‌తోపాటు, రవాణా ఛార్జీలను నిర్ధారించారు. అయినా నాయకులు దళారుల అవతారమెత్తి అధిక ధరలకు ఇసుకను సరఫరా చేస్తున్నారు. తీపర్రులో లారీ ఇసుక కోసం అదనంగా రూ.5 వేలు, లోడింగ్ కోసం రూ.2,360 వసూలు చేస్తున్నారు. ఆ పైన లారీ యజమానులు రవాణా చార్జీలు వేసుకుని ఇసుకను సరఫరా చేయాలి. తీపర్రు నుంచి 20 టన్నుల లారీ ఇసుక తాడేపల్లిగూడెం రావాలంటే కేవలం రూ.10 వేలు, భీమవరానికి రూ.15 వేలు దాటి వెళ్లడానికి వీలు లేదు. కాని అదనంగా వసూలు చేస్తున్నారు.

కలెక్టర్ ఆదేశాలు బేఖాతర్

తీపర్రు ర్యాంప్‌ను సోమవారం కలెక్టర్ చదలవాడ నాగరాణి సందర్శించారు. అదనపు ఛార్జీలు వసూలు చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అయినా నిర్వాహకులు బేఖాతరు చేస్తున్నారు. ప్రభుత్వం ఇసుక తవ్వకాలను ప్రైవేటు కాంట్రాక్టర్లకు అప్పగించింది. దీనివల్ల స్థానికుల ప్రమేయం ఉండదని భావించింది. ఇసుక సరఫరాలో జోక్యం చేసుకోకూడదంటూ సీఎం చంద్రబాబు ఎమ్మెల్యేలకు, నాయకులకు హెచ్చరికలు జారీ చేశారు. ఇవేమీ పనిచేయడం లేదు. కాంట్రాక్టర్లను తమ గుప్పిట్లోకి నేతలు తెచ్చుకున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అందువల్లే లారీకి అదనంగా రూ.5 వేలు చెల్లిస్తేనే లోడింగ్ చేస్తున్నారు. లేదంటే తిరస్కరిస్తున్నారు. ఫలితంగా లారీ యజమానులు ఆ సొమ్మును చెల్లించి ఇసుకను రవాణా చేస్తున్నారు. దాంతో ఉచిత ఇసుక విధానంలోనూ ధరలు దిగిరావడం లేదు. దీనివల్ల ఉచిత ఇసుక విధానం అభాసుపాలవుతోంది.

స్టాక్ పాయింట్ వద్ద గందరగోళం

జిల్లాకు కేటాయించిన ఔరంగాబాద్ రీచ్ నుంచి పడవల ద్వారా నందమూరు అక్విడెక్ట్ సమీపంలోని స్టాక్ పాయింట్ వద్దకు తీసుకువస్తున్నారు. రీచ్‌లో తవ్వకాలు చేయాలంటే ఖర్చు అధికమవుతుంది. దీంతో టన్ను ధర రూ.230గా నిర్ణయించారు. 20 టన్నుల ఇసుక రూ.4,600కు రావాలి. దీనికి అదనంగా రవాణా చార్జీలు వసూలు చేయాలి. ఔరంగాబాద్ ఇసుక నాణ్యత కారణంగా డిమాండ్ ఉంటుంది. నదిలోకి దిగి ఇసుకను తవ్వుకు వస్తారు. దీనివల్ల ధర అధికంగా ఉంటుంది. అయినా సరే లారీ ఇసుక తాడేపల్లిగూడెం రావడానికి రూ.10 వేలకు మించి ఉండదు. ఔరంగాబాద్ వరకు లారీలు వెళ్లే అవసరం లేదు. తాడేపల్లిగూడెం రూరల్ మండలం నందమూరు సమీపంలోని స్టాక్ పాయింట్‌కు ఇసుక చేరిపోతుంది. అక్కడ టన్నుకు రూ.400 ఇవ్వాలంటూ ఓ నాయకుడు డిమాండ్ చేశారు. స్టాక్ పాయింట్ నిర్వహణ బాధ్యతను ఓ వ్యాపారికి అప్పగించారు. అతను టన్నుకు రూ.400 ఇవ్వాలని పట్టుబడితే లారీ యజమానులు తిరగబడ్డారు. దీంతో నిర్వాహకుడు అక్కడి నుంచి వెళ్లిపోయారు. అయితే అదనపు సొమ్ములు ఇవ్వకపోతే తవ్వకాలు నిలిపివేస్తున్నారు. అధికార యంత్రాంగం నిస్సహాయ స్థితిలో ఉంటోంది. అంతిమంగా ప్రభుత్వ ఉచిత ఇసుక విధానం అభాసుపాలవుతోంది. ధరలను అదుపు చేయడం కోసం ప్రభుత్వ ఆదాయాన్ని వదులుకున్నారు. సీనరేజీ, జీఎస్టీలను తొలగించారు. అయినా ధరలు దిగిరాకపోవడం విస్మయం కలిగిస్తోంది.

తీపర్రులో ఇసుక వివాదం

పెరవలి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): తీపర్రు ర్యాంప్ నుంచి ఇసుకను స్టాక్ పాయింట్‌కు తరలించేందుకు మంగళవారం ఉదయం సుమారు 40 ట్రాక్టర్లు వచ్చాయి. అయితే ఇసుక ఎగుమతికి కాంట్రాక్టర్, బంటా కార్మికులు నిరాకరించారు. ఆ పక్కనే వున్న ఉసులుమర్రు వైపు గల ఈ ర్యాంప్‌లో ఉచిత ఇసుక తీసుకెళ్లేందుకు ట్రాక్టర్ యజమానులు సిద్ధమయ్యారు. అయితే తమ ర్యాంప్ నుంచి ట్రాక్టర్లు కిందకు దిగడానికి వీల్లేదని కాంట్రాక్టు పొందిన వ్యక్తులు అక్కడ బాటకు అడ్డంగా మట్టిపోశారు. దీంతో వివాదం పెద్దదై.. ఇరు వర్గాలు మాటామాటా అనుకున్నాయి. సమాచారం అందడంతో తహసీల్దార్ అచ్యుతకుమారి ఘటనా స్థలానికి చేరుకుని అనుమతి పొందిన ర్యాంప్‌లో మాత్రమే ఉచిత ఇసుక తీసుకోవాలని, వేరొక ర్యాంప్ ద్వారా తీసు కెళ్లడం కుదరదన్నారు. అనుమతి పొందిన ర్యాంపులో ఇవ్వకపోవడం వల్లే ఇక్కడకు వచ్చామని ట్రాక్టర్ యజమానులు చెప్పడంతో తహశీల్దార్ ఆ కాంట్రాక్టర్‌తో మాట్లాడి ఉచిత ఇసుక ఎగుమతి అయ్యేలా చూడాలని సూచించారు.



పశ్చిమకు ఇసుక సరఫరాపై తహసీల్దార్‌ను ప్రశ్నిస్తున్న డిప్యూటీ కలెక్టర్

తీపర్రు ఇసుక ర్యాంప్‌లో పశ్చిమ గోదావరి జిల్లాకు సంబంధించిన లారీలకు ఇసుక ఎందుకు ఎగుమతి చేయడం లేదంటూ తాడేపల్లిగూడెం డిప్యూటీ కలెక్టర్ కతీఫ్ కౌసర్‌భాను ప్రశ్నించారు. తీపర్రు ఇసుక ర్యాంప్‌ను మంగళవారం పరిశీలించారు. ర్యాంపు నిర్వాహకులపై మండిపడ్డారు. ఇక్కడి నుంచి పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన లారీలకు ఇసుక ఎగుమతులు జరగాల్సి ఉన్నప్పటికి ఎందుకు వేయడం లేదని ప్రశ్నించారు. తగినంత స్టాక్ లేకపోవడం వల్ల గోదావరి నుంచి స్టాక్ పాయింట్‌కు ట్రాక్టర్లపై ఇసుక తరలిస్తున్నామన్నారు. స్టాక్ పాయింట్‌కు ఇసుక చేరుకున్న తర్వాత ఎగుమతులు చేస్తామన్నారు.



డిప్యూటీ స్పీకర్‌గా ఆర్‌ఆర్‌ఆర్

విప్‌లుగా బొలిశెట్టి, బొమ్మిడి -7లో..






ఆకాశంలో ఆర్ట్ గ్యాలరీ !

ఆకాశం రంగులద్దుకుంది.. సూర్యుడు మబ్బుల చాటు నుంచి ఇదిగో ఇలా అందమైన దృశ్యాలను ఆవిష్కరించాడు.. ఆకాశంలో పెయింటింగ్ పోటీలు పెట్టినట్టుగా రకరకాలు రంగులు కనువిందు చేశాయి..మంగళవారం సాయంత్రం ద్వారకాతిరుమలలో కనిపించిన ఈ దృశ్యాలు చూపరులను కట్టిపడేశాయి. అప్పటి వరకు నీలవర్ణంలో శోభిల్లిన ఆకాశం రంగులు మారుతూ అరుణ కాంతులను ప్రజ్వలింప చేశాయి. ఆహా...ఏమి ఈ సోయగం అంటూ చూపరులు కొంతసేపు ముగ్ధులయ్యారు.

- ద్వారకాతిరుమల



నేడు క్షీరాబ్ది ద్వాదశి

నేటితో చతుర్మాస వ్రత సమాప్తి



ఏలూరు కార్పొరేషన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : నేడు క్షీరాబ్ది ద్వాదశి. దేవ దానవులు ఈ రోజునే క్షీరసాగర మథనం చేశారని అందుకే చిలుకు ద్వాదశి అంటారని చెబుతారు. కార్తీక శుద్ధ ఏదాదశి రోజున క్షీర సముద్రంపై శయనించిన విష్ణుమూర్తి నిద్ర లేచి బ్రహ్మాది దేవతలతో కలిసి తులసి వనంలోకి (బృందావనం) ప్రవేశిస్తారట.. అందుకే ఈ రోజున ఎవరైతే తులసి మొక్కకు పూజ చేస్తారో వారికి సకల శుభాలు కలుగుతాయని పురాణాలు ద్వారా తెలుస్తోంది. కార్తీకమాసంలో క్షీరాబ్ది ద్వాదశి రోజున చేసే పూజలు, వ్రతాలు, దీపారాధనలు ఎంతో పుణ్యప్రదమని ఏలూరు రామచంద్రరావుపేట వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రధాన అర్చకులు కిళాంబి మారుతీ శ్రీనివాస రామానుజాచార్యులు చెప్పారు. క్షీరాబ్ది ద్వాదశి రోజున కొత్తగా తులసి మొక్కను నాటి విష్ణువును పూజించాలన్నారు. తులసి కోటలో ఉసరి కొమ్మను ఉంచి పసుపు, కుంకుమలతో ఓం తులసీ ధాత్రి సహిత లక్ష్మీ నారాయణస్వామిని పూజించాలి. శ్రీ మహావిష్ణవే దామోదరాయ శ్రీదేవ్యైతులసై నమః అని స్తోత్రించాలి. ఈ రోజున దీపం వెలిగించిన వారికి ఏడాది పొడవునా దీపం వెలిగించిన ఫలితం దక్కుతుంది. ఈ రోజున విష్ణువును ప్రార్థించి పూజించడం ద్వారా చతుర్మాస్య వ్రత సమాప్తం అవుతుందని తెలిపారు.





శ్రీవారి జల విహారానికి ఏర్పాట్లు పూర్తి


ద్వారకాతిరుమల, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి):ప్రముఖ పుణ్యక్షేత్రం ద్వారకాతిరుమలలో శ్రీవారి తెప్పోత్సవం వైభవంగా నిర్వహించేందుకు దేవస్థానం అన్ని ఏర్పాట్లు చేసింది. క్షీరాబ్ది ద్వాదశి పర్వదినమైన బుధవారం రాత్రి స్వామివారు ఉభయదేవేరులతో కలసి సుదర్శన పుష్కరిణిలో విహరిస్తారు. దేవస్థానం ఇప్పటికే పుష్కరిణిని సర్వాంగసుందరంగా తీర్చిదిద్దింది. సాగర పరిసరాలను విద్యుత్ దీపకాంతులతో అలంకరించారు. స్వామి, అమ్మవార్లు విహరించే తెప్పను హంసవాహనంగా అలంకరిస్తున్నారు. పుష్కరిణి ముందు భారీ విద్యుత్ కటౌట్‌లను ఏర్పాటు చేశారు. బుధవారం రాత్రి శ్రీవారు, ఉభదేవేరులతో కలసి ప్రత్యేక వాహనంలో తిరువీధుల్లో తిరిగి పుష్కరిణి వద్దకు చేరుకుంటారు. అనంతరం పుష్కరిణిలో విహరిస్తారు.





కల్యాణం తిలికిస్తున్న భక్తులు.. కల్యాణ శోభలో స్వామివారు

ఘనంగా శ్రీనివాస కల్యాణం



పెంటపాడు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : పెంటపాడు వెలమ యువజన సంఘం ఆధ్వర్యంలో జరుగుతున్న గౌరీదేవి మహోత్సవాలలో భాగంగా అమ్మవారి ఆలయం వద్ద మంగళవారం శ్రీనివాస కల్యాణం ఘనంగా నిర్వహించారు. కల్యాణ వేడుకను తిలకించేందుకు అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. కళ్యాణం అనంతరం భక్తులకు తీర్థ ప్రసాద వితరణ గావించారు. ఈ నె ల 15వ తేదీ శుక్రవారం ఆలయం వద్ద విజయవాడ దుర్గా మల్లేశ్వరస్వామి కల్యాణం నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.



వీరభద్రస్వామికి ఘనంగా జలాభిషేకం

ఆకివీడు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : ఆకివీడు కాశీ విశ్వేశ్వర అన్నపూర్ణ సహిత భద్రకాళీ సమేత వీరభద్రస్వామి 14వ వార్షికోత్సవ కల్యాణం స్థానిక సాలిపేటలో మంగళవారం ఘనంగా జరిగింది. మహిళలు కాలువలో స్నానమాచరించి 108 బిందెలతో తీసుకు వచ్చిన గంగాజలం, పంచామృతాలతో అభిషేకం చేశారు. కార్తీక ద్వాదశి కావడంతో సాయంత్రం మహిళలు సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. కళ్యాణానికి పీటలపై కూర్చున్న సిద్ధాని శ్రీనివాస్-మహేశ్వరీ దంపతులు బంగారు సూత్రాలు అందజేశారు. అర్చకులు స్వామి కళ్యాణం చేయించారు. రాత్రి స్వామి ప్రభ ఊరేగింపు, శూలాల సంబరం జరిపారు.

గణపవరం డిగ్రీ కళాశాలలో మహిళల టెన్నిస్ టోర్నమెంట్

గణపవరం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): గణపవరం చింతలపాటి మూర్తి రాజు ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో ఆదికవి నన్నయ్య విశ్వ విద్యాలయం ఆధ్వర్యంలో మహిళల టేబుల్ టెన్నిస్ టోర్నమెంట్ మంగళవారం ప్రారంభించారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో కూడా రాణించాలని ప్రిన్సిపాల్ డాక్టర్ నిర్మల కుమారి సూచించారు. తొలిరోజు జరిగిన పోటీల్లో ప్రథమ స్థానంలో పెనుకొండ ఎస్‌పీకేవీ కళాశాల విద్యార్థులు నిలవగా రెండో స్థానంలో తణుకు ఎస్‌కేఎస్‌డీ మహిళా కళాశాల, 3వ స్థానం ఏలూరు సెయింట్‌థెరిస్సా, నాల్గో స్థానంలో



గణపవరం మూర్తిరాజు ప్రభుత్వ డిగ్రీ కళాశాల క్రీడాకారులు విజయం సాధించారు. పీడీలు ఫణీంద్ర, పవన్‌కుమార్, వైస్ ప్రిన్సిపాల్ మధు రాజు, అధ్యాపకులు, పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్లకు రీసర్వే చిక్కులు

ఎల్‌పీ నంబర్లు కేటాయించిన గ్రామాల్లో నిలిచిన రిజిస్ట్రేషన్లు

దిక్కుతోచని కక్షిదారులు



ఆచంట, నవంబరు, 12 (ఆంధ్రజ్యోతి): భూములు, స్థలాలు అమ్మకాలు, కొనుగోలు విషయంలో కక్షిదారులకు ఇంకా ఇబ్బందులు తప్పలేదు. ఇటీవల రిజిస్ట్రేషన్‌ల లావాదేవీలుబాగా తగ్గిపోయాయి. గత ప్రభుత్వం వ్యవసాయ భూములకు సంబంధించి భూముల రీసర్వే విధానం ప్రవేశ పెట్టింది. అయితే సర్వే చేసిన అనంతరం అధికారులు ఆయా సర్వే నంబర్‌లకు సంబంధించి ఎల్‌పీ నంబర్లు కేటాయించారు. ఆ సర్వే నంబర్లకు సంబంధించి మొదట్లో రిజిస్ట్రేషన్‌లు నిలిచిపోయాయి. ఆచంట సబ్ రిజిస్ట్రార్ పరిధిలో ఆచంట, పెనుగొండ, పోడూరు మూడు మండలాలకు సంబంధించి 20 గ్రామాలు ఉన్నాయి. అయితే ఆచంట మండలంలోని కొడమంచిలి, కరుగోరుమిల్లి, పెనుమంచిలి, గ్రామాలు పోడూరు మండలంలో రావిపాడు, మినిమించిలిపాడు గ్రామాలు, పెనుగొండ మండలంలో నడిపూడి గ్రామాలకు సంబంధించి రీసర్వే నంబర్లకు సంబంధించి ఎల్‌పీ నంబరు కేటాయించడంతో ఈ గ్రామాలకు సంబంధించి రిజిస్ట్రేషన్‌లు మొదట్లో రిజిస్ట్రేషన్‌లు జరిగేవి కావు. అయితే ఎల్‌పీ నంబర్లుకు సంబంధించి ఇటీవల కాలంలో రిజిస్ట్రేషన్‌లు జరిగాయి. సుమారు 2 నెలలపాటు రిజిస్ట్రేషన్‌లు బాగానే జరిగాయి. పది రోజులుగా ఎల్‌పీ నెంబర్లు కేటాయించిన గ్రామాలకు సంబంధించి రిజిస్ట్రేషన్లు నిలిచిపోయాయి. దీంతో ఈ గ్రామాలకు సంబంధించి భూములు అమ్మాలన్నా, ఇంటిలో వారికి సెటిల్‌మెంటు దస్తావేజు రాయాలన్నా, పెళ్ళి దస్తావేజులు రాయాలన్నా రిజిస్ట్రేషన్‌లు జరగడం లేదు. దీని కారణంగా ప్రభుత్వానికి వచ్చే రెవెన్యూ కూడా ఘననీయంగా తగ్గిపోయింది. ఇటీవల పెట్టిన రెవెన్యూ సదస్సుల్లో సైతం రీసర్వే విధానం రద్దు చేయాలని అనేక మంది రైతులు అధికారులకు పిర్యాదులు కూడా చేశారు. రీసర్వే విధానం వల్ల తమ భూములకు సంబంధించి సరైన రికార్డులు లేకుండా పోయాయని కనీసం ఇపుడు రిజిస్ట్రేషన్ చేసుకుందామన్నా రిజిస్ట్రేషన్‌కు అనుకూలంగా లేకుండా పోయిందని పలువురు కక్షిదారులు వాపోతున్నారు. ఇటీవల ఈ గ్రామాలకు సంబంధించి రిజిస్ట్రేషన్‌లు సజావుగా జరిగినప్పటికి మరలా రిజిస్ట్రేషన్‌లు నిలిచిపోవడంపై రైతులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి రీసర్వే అయిన గ్రామాలకు సంబంధించి భూములు రిజిస్ట్రేషన్‌లు సజావుగా అయ్యేట్లు చూడాలని కోరుతున్నారు.

మూడు నెలలుగా నిలిచిపోయాయి

ఆచంట మండలంలోని పెదమల్లం గ్రామానికి సంబంధించిన భూములకు రీసర్వే అవ్వలేదు. అయినప్పటికి మూడు నెలలుగా ఈ గ్రామానికి సంబంధించి రిజిస్ట్రేషన్‌లు నిలిచిపోయాయి. సర్వే నెంబరుకు సంబంధించి డేటా వివరాలు డిస్‌ప్లే అవని కారణంగా రిజిస్ట్రేషన్‌లు నిలిచిపోయాయి. దీనిపై సంబంధిత అధికారులను అడిగినప్పటికి టెక్నికల్ ప్రోబ్లమ్ వల్లే సమస్య వచ్చిందని త్వరలోనే సమస్య తీరుతుందని చెబుతున్నారు.



పాస్టర్ల ఆందోళన

నరసాపురం టౌన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): పాస్టర్లు, మందిరాలకు భద్రత కల్పించాలంటూ మంగళవారం క్రైస్తవుల సంఘం ఆధ్వర్యంలో సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. పట్టణంతో పాటు యలమంచిలి, మొగల్తూరు ప్రాంతాలకు చెందిన పాస్టర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాస్టర్లు రుబేన్, గుమ్మాపు శ్యామ్, ఈదా జాషువ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా పాస్టర్ల డేటాను సచివాలయ సిబ్బంది చేత ప్రభుత్వం సేకరించడం దారుణమన్నారు. ఈ విధానం వల్ల సేవ చేసే వార్ని భయభ్రాంతులకు గురిచేస్తుందన్నారు. డేటా సేకరణ నిలుపుదల చేయనిపక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమిస్తామని హెచ్చరించారు.

స్కూల్‌గేమ్స్‌లో సూర్యహంసినికి నాలుగు బంగారు పతకాలు



భీమవరం టౌన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : భారతీయ విద్యాభవన్స్‌లో 11వ తరగతి చదువుతున్న మాదాల సూర్యహంసినీ గుజరాత్‌లో జరిగిన 68వ నేషనల్ స్కూల్స్ గేమ్స్‌లో నాలుగు బంగారు పతకాలను సాధించింది. ఈనెల 10 నుంచి 12 వరకు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో జరిగిన పోటీల్లో ఉమన్ నేషనల్ ర్యాంకింగ్ విలువిద్య అండర్-17సబ్ జూనియర్స్ కేటగిరీలో వ్యక్తిగత కేటగిరీలో 1వ రౌండ్‌లో బంగారుపతకం, రెండో రౌండ్‌లో బంగారు పతకం, ఓవరాల్‌గా బారీ స్కోర్ చేసి బంగారు పతకాన్ని గెలుచుకుంది. ఈ నాలుగు బంగారు పతకాలు కారణంగా పతకాల పట్టికలో ఆంధ్రప్రదేశ్ 31వస్థానం నుంచి 5వ స్థానానికి చేరుకోవటం విశేషం. సూర్యహంసినిని జిల్లా ఆర్చరీ అసోసియేషన్ సెక్రటరీ జయరాజు, కోచ్ కమల్ కిషోర్, సాయిహిత్‌లు అభినందించారు.



విజయం సాధించిన మెడికల్ సెకండియర్ విద్యార్థులు

ఆశ్రం మెడికల్ కళాశాలలో ఉత్సాహంగా ఫుట్‌బాల్ పోటీలు

ఏలూరు రూరల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఆశ్రం మెడికల్ కళాశాలలో ఆ కళాశాల మెడికల్ విద్యార్థుల మధ్య జరిగిన క్రీడాపోటీలు ఉత్సాహంగా జరిగాయి. వారం రోజులుగా ఇంటర్, మోరల్ ఫుట్‌బాల్ క్రీడాపోటీలను నిర్వహించారు. మంగళవారం ఫైనల్ పోటీ జరిగింది. పోటీల్లో మెడికల్ సెకండియర్ విద్యార్థులు కప్పు కైవశం చేసుకున్నారు. మెడికల్ పీజీ విద్యార్థులు ద్వితీయ స్థానంలో నిలిచారు. సీఈవో హనుమంతరావు, జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి పవన్‌కుమార్ బహుమతులు అందజేశారు. గెలుపొందిన క్రీడాకారులను ఆశ్రమ యాజమాన్యం అభినందించి బహుమతులు, ప్రశంసాపత్రాలను అందజేశారు.

జాతీయ స్థాయి స్కూల్ గేమ్స్‌కు తూర్పుతాళ్ళు విద్యార్థిని



నరసాపురం రూరల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తూర్పుతాళ్ళు హైస్కూల్‌లో 8వ తరగతి చదువుతున్న మేడిద డింపుల్ శ్రీజ విద్యార్థి జాతీయస్థాయి పోటీకి ఎంపికైంది. ఇటీవల కడప జిల్లా కమలాపురంలో జరిగిన 68వ రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ అండర్-14 బాలబాలికల పోటీలకు తూర్పు తాళ్ళు స్కూల్ నుంచి ఆరుగురు విద్యార్థినులు పాల్గొన్నారు. వీరిలో శ్రీజ ఎంపికై త్వరలో బీహార్‌లో జరిగే పోటీలకు ఆంధ్రప్రదేశ్ జట్టు తరపున పాల్గొంటుందని స్కూల్ ప్రిన్సిపాల్ అనిల్ కుమార్ తెలిపారు. స్కూల్ చైర్మన్ చామకూరి రాజు, పీడీ రామకృష్ణ, ఉపాధ్యాయులు విద్యార్థిని అభినందించారు.

నేటి నుంచి సీనియర్ సిటిజన్స్ జాతీయస్థాయి టెన్నిస్ పోటీలు

పాలకొల్లు అర్బన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): పాలకొల్లు కాస్మో కల్చరల్ క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం నుంచి 17వ తేదీ వరకూ క్లబ్ ఫౌండర్, టెన్నిస్ ప్లేయర్ సిహెచ్ బుద్ధావతారం రాజు మెమోరియల్ పేరుతో జాతీయ స్థాయిలో టెన్నిస్ పోటీలకు అన్ని ఏర్పాట్లను చేశారు. కాస్మో కల్చరల్ క్లబ్ చైర్మన్ గొట్టుముక్కల గాంధీ భగవాన్ రాజు పర్యవేక్షణలో 45, 55, 65, 70, 75 వయసుల వారీగా సింగిల్, డబుల్స్ పోటీలు నిర్వహించనున్నారు. పోటీలు పట్టణంలోని కాస్మో క్లబ్ ఆవరణలోని కోర్టులోనూ, టౌన్‌హాల్ కోర్టులోనూ, నరసాపురం ఆఫీసర్సు క్లబ్ కోర్టులోనూ జరుగుతాయి. పోటీల అనంతరం ఈనెల 17న ఫైనల్ మ్యాచ్, అనంతరం బహుమతి ప్రదానం జరుగుతుంది. డైరెక్టర్ సోమరాజు, ఆర్గనైజింగ్ కార్యదర్శి రాజు, రుద్రరాజు సత్యనారాయణ రాజు, శ్రీనివాస రాజు పర్యవేక్షిస్తున్నారు.



సీనియర్ సిటిజన్స్ జాతీయ స్థాయి టెన్నిస్ పోటీలకు సిద్ధమైన కోర్టు

స్విమ్మింగ్ పోటీల విజేతలకు ఎస్పీ అభినందన

భీమవరం క్రైం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : స్విమ్మింగ్ కాంపిటీషన్లో గోల్డ్ మెడల్ గెలిచిన పోలీస్ సిబ్బందిని జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి మంగళవారం అభినందించారు. రాజమహేంద్రవరంలో ఆదివారం జరిగిన ఆంధ్రప్రదేశ్ మాస్టర్స్ స్విమ్మింగ్ అసోసియేషన్ నిర్వహించిన రాష్ట్ర స్థాయి స్విమ్మింగ్ పోటీలలో డీసీఆర్‌బీ హెడ్ కానిస్టేబుల్ వసుపులేటి సత్యనారాయణ 200 మీటర్ల ఫ్రీస్టైల్‌లో గోల్డ్ మెడల్, 100 మీటర్లు ఐఎమ్‌లో గోల్డ్ మెడల్, 100 మీటర్ల బ్రెస్ట్ స్ట్రోక్‌లో సిల్వర్‌మెడల్, 50 మీటర్ల బ్యాక్ స్ట్రోక్ విభాగంలో గోల్డ్ మెడల్, 25 మీటర్లు బ్యాక్ స్ట్రోక్ విభాగంలో గోల్డ్ మెడల్, 100 మీటర్లు బ్యాక్‌స్ట్రోక్ విభాగంలో సిల్వర్ మెడల్ గెలుచుకున్నారు. మెడల్స్‌ని సాధించిన పోలీస్ సిబ్బందిని జిల్లా ఎస్పీ అస్మి అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పోలీస్ అసోసియేషన్ ప్రెసిడెంట్ సీహెచ్ మోజేష్, తదితరులు పాల్గొన్నారు.



సిబ్బందిని అభినందిస్తున్న ఎస్పీ నయీం అస్మీ

పేదల ఆకలి తీర్చే దేవుళ్లు



ఆహార పదార్థాలను పేదలకు పెడుతున్న సంస్థ సభ్యులు



ఆయన ఒక దివ్యాంగుడు.. పోస్టల్ శాఖలో ఉద్యోగి. వైకల్యం కారణంగా ఆయన సరిగా నడవలేరు.. కానీ ఆలోచనలు మంచి సమాజానికి బాటలు వేశాయి.. సమాజం తనకు ఎంతో సహకారం ఇచ్చిందని అలాంటి సమాజానికి తాను కూడా ఏదో ఒకటి చేయాలనే ఆలోచన నుంచి పుట్టుకొచ్చిన సంస్థ లక్షన్నర పేదల కడుపు నింపింది. తాడేపల్లిగూడెంలో పోస్టల్ శాఖలో చిరుద్యోగిగా పనిచేస్తున్న తమ్మిరెడ్డి బాలబ్రహ్మం నో ఫుడ్ వేస్ట్ సంస్థను స్థాపించి పేదల కడుపు నింపుతున్నారు..

తాడేపల్లిగూడెం రూరల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): పోస్టల్ శాఖలో పనిచేస్తూ అందరి మన్ననలు పొందిన బాలబ్రహ్మం తనకు 50 ఏళ్లు పూర్తయిన సమయంలో



పేదలకు భోజనం అందిస్తున్న బొలిశెట్టి(ఫైల్)

నో ఫుడ్ వేస్ట్ సంస్థ ద్వారా సేవలు

శుభకార్యాల్లో మిగిలిన పదార్థాలు వృథా కాకుండా అన్నార్థులకు పంపిణీ

సమాజం కోసం ఏం చేద్దాం అని ఆలోచించారు. ఒక పూట భోజనం దొరికితే చాలనుకునే పేదలు చాలామంది ఉన్నారు. ఆ సమయంలో వారికి ఇంత అన్నం పెడితే చాలు దేవుళ్లగా భావిస్తారు. ఫంక్షన్లలో మిగిలిన ఆహారం వేస్ట్ చేయకుండా పేదలకు పంచే ఒక సంస్థ కార్యకలాపాలను చూసి అలా చేస్తే బావుంటుందని భావించి స్నేహితులతో చెప్పారు. వారు కూడా ఈ ఆలోచన బాగుందని చెప్పడంతో 2015లో "నో ఫుడ్ వేస్ట్ " అనే సేవా సంస్థ పురుడు పోసుకుంది. అప్పటి నుంచి ఆ సంస్థ ద్వారా స్నేహితుల సహకారంతో ఏ ఇంట వేడుక జరిగినా అక్కడ మిగిలిన ఆహారం వృథా కాకుండా ఆ ఆహారాన్ని పేదలకు, బాటసారులకు అందించడం ప్రారంభించారు. ఇలా తొమ్మిది సంవత్స రాలుగా సేవలందిస్తూ ఇప్పటివరకు లక్షన్నర మంది ఆకలి తీర్చారు.

కరోనాలో కూడా..

వీరు సాధారణ సమయంలో పేదలకు ఆహారం అందించడంతో పాటు కరోనా సమయంలో కూడా తమ వంతు సాయం అందించారు. రూ. 25 లక్షలు విలువ చేసే పేదలకు ఇమ్యూనిటీ అందించే విధంగా ఆహారంతో పాటు, టీపొడి, పాలపొడి, ఆహారం, ఫ్రూట్ జూస్, బోర్నవిటా వంటివి అందించారు.

బాసటగా బొలిశెట్టి

పెద్దోళ్ల ఇంట జరిగే వేడుకల్లో మిగిలే ఆహారం వృధా కాకుండా పేదలకు ఆహారం అందించే సంస్థ సేవలను అప్పటి మున్సిపల్ చైర్మన్, ప్రస్తుత ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ గుర్తించి బాసటగా నిలిచారు. ఆ సంస్థకు ఉపయోగపడే విధంగా ఓ వాహనాన్ని (మారుతి ఎకోను) ఆయన ఉచితంగా అందించారు.

స్నేహితులు తోడుగా నిలిచారు..



సమాజానికి ఏదోకటి చేద్దామని తలవగానే నా స్నేహితులు తోడుగా నిలిచారు. వారితో పాటు పట్టణంలో ప్రముఖులు కూడా సంస్థకు సహకరించారు. మరిన్ని సేవలు అందిచేలా ప్రణాళికలు వేసుకుంటున్నాం. ఇప్పటికే లక్ష మందికి పైగా ఆహారం అందించాం.

- తమ్మిరెడ్డి బాలబ్రహ్మం, నో ఫుడ్ వేస్ట్ సంస్థ వ్యవస్థాపకుడు

భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు



మా బాలబ్రహ్మం ఎంతో పెద్ద మనసుతో ఈ సంస్థ ఏర్పాటు చేద్దామని ఆలోచించారు. ఆయనకు మేం తోడుగా నిలిచాం. సంస్థ ద్వారా ఎంతో మందికి సాయం అందించాం ఆకలితో ఉన్నవారికి భోజనం అందించడం ఆనందాన్నిస్తుంది. పేదలకు సాయం చేసేం దుకు ఇదే స్ఫూర్తితో సంస్థ కార్యకలాపాలు విస్తృతం చేస్తాం.

- యెగ్గిన శరత్, సంస్థ ప్రతినిధి

ఆంధ్రా షుగర్స్‌కు బ్రిటిష్ డిప్యూటీ హైకమిషనర్



భారత్‌లోని బ్రిటిష్ డిప్యూటీ హై కమిషనర్ గారెత్ విన్ ఓవెన్ తణుకు ఆంధ్రా షుగర్స్‌ను మంగళవారం సందర్శించారు. కార్యాలయంలో జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ పెండ్యాల నరేంద్రనాథ్, డైరెక్టర్ విక్రమ్ బాబును మర్యాదపూర్వకంగా కలిశారు. - ఇరగవరం

డిప్యూటీ స్పీకర్‌గా ఆర్ఆర్ఆర్

విప్‌లుగా బొలిశెట్టి, బొమ్మిడి



(భీమవరం-ఆంధ్రజ్యోతి)

తెలుగుదేశం ఉండి ఎమ్మెల్యే రఘురామ కృష్ణరాజుకు డిప్యూటీ స్పీకర్ పదవి వరించ నుంది. కూటమి ప్రభుత్వం ఆ దిశగా కీలక నిర్ణయం తీసుకుంది. అసెంబ్లీలో ఎన్నికద్వారా డిప్యూటీ స్పీకర్ పదవిని నియమిస్తారు. అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్‌గా రఘురామరాజు నియామకం లాంచనప్రాయం కానుంది, వైసీపీ ప్రభుత్వంలో ప్రజాగళం వినిపించి రఘురామరాజు రెబల్ ఎంపిగా మిగిలారు. ఎన్నికల ముందు టీడీపీకి చేరువయ్యారు. ఉండి ఎమ్మెల్యే అభ్యర్థిగా నిలబడి విజయం సాధించారు. తొలుత రఘురామ రాజుకు స్పీకర్ పదవి వస్తుందన్న చర్చ సాగింది. అయ్యన్నపాత్రునికి స్పీకర్ పదవి దక్కింది.

మరోవైపు జిల్లాకు చెందిన ఇద్దరు ఎమ్మెల్యేలను విప్‌లుగా నియమించింది. తాడేపల్లిగూడెం జనసేన ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్, నర్సాపురం జనసేన ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్‌లను నియమిస్తూ ఆదేశాలు జారీ చేసింది. శాసనసభలో చీఫ్ విప్‌తో సహా మరో 15 మంది ఎమ్మెల్యేలను ప్రభుత్వం విప్‌లుగా ప్రకటించారు. అందులో 12 మంది టీడీపీ, ముగ్గురు జనసేన, ఒక బీజేపీ ఎమ్మెల్యేలుగా ఉన్నారు. జనసేనలో ముగ్గురు ఎమ్మెల్యేలలో జిల్లాకు చెందిన ఇద్దరికి ప్రభుత్వం విప్‌లుగా నియమించింది. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సూచనలు మేరకే జిల్లాలో జనసేన ఎమ్మెల్యేలకు విప్‌ల కేటగిరిలో ప్రాధాన్యత ఇచ్చారు. బొలిశెట్టి, బొమ్మిడి తొలిసారి ఎమ్మెల్యేలుగా ఎన్నికై అసెంబ్లీలో అడుగు పెట్టారు.

కార్పొరేషన్‌లకు డైరెక్టర్ల నియామకం

నాలుగు పదవులు దక్కించుకున్న ఏలూరు, పశ్చిమ నాయకులు



కళింగ కార్పొరేషన్ డైరెక్టర్‌గా సీతారామాంజనేయులు

ఆకివీడు రూరల్ నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): పెదకాపవరం టీడీపీ నాయకుడు లంబాడి సీతారామాంజనేయులును రాష్ట్ర కళింగ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమిస్తూ సీఎం చంద్రబాబు ఆదేశాలు జారీ చేశారు. 1999 నుంచి టీడీపీకి అంకితభావంతో పనిచేస్తున్నారు. ప్రస్తుతం యూనిట్ ఇన్‌చార్జిగా ఉన్నారు.

రాష్ట్ర శెట్టి బలిజ కార్పొరేషన్ డైరెక్టర్‌గా చిట్టిబోయిన



జంగారెడ్డిగూడెం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): జంగారెడ్డిగూడెం పట్టణానికి చెందిన టీడీపీ రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి చిట్టిబోయిన రామలింగేశ్వరరావు రాష్ట్ర శెట్టి బలిజ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులయ్యారు. ఈ సందర్భంగా పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి దాసరి శ్యామ్ చంద్రశేఖ తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్‌గా వాతాడి



నరసాపురం రూరల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్‌గా వేములదీవి గ్రామానికి చెందిన వాతాడి ఉమాను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఎమ్మెల్యే నాయకర్, ఇన్‌చార్జి పొత్తూరి రామరాజు, కొవ్వలి నాయుడు, జక్కం శ్రీమన్నారాయణ, గుబ్బల నాగరాజు, కొప్పాడ రవి తదితరులు అభినందనలు తెలిపారు.



ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్‌గా మురళి

తాడేపల్లిగూడెం అర్బన్, నవంబరు 12 (నవంబరు): ఆర్యవైశ్య కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్‌గా పట్టణానికి చెందిన తెలుగుదేశం నాయకుడు పద్మనాభుని మురళి నియమితులయ్యారు. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వలవల బాబ్జి, కూటమి నాయకులు మురళిని అభినందించారు.

మంత్రి లోకేశ్‌ను కలిసిన పేరాబత్తుల



కాకినాడ సిటీ, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధి, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్‌ను అమరావతి సచివాలయంలో తూర్పు-పశ్చిమ ఉమ్మడి గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి పేరా బత్తుల రాజశేఖర్ మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ నియోజ కవర్గ పరిధిలో జరుగుతున్న ఓటర్ల నమోదు ప్రక్రియను రాజశేఖర్ వివరించారు. ఉభయ గోదావరి జిల్లాల కూటమి ఇన్ చార్జి మంత్రులు, జిల్లా మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, జిల్లా అధ్య క్షులు, పార్టీ ఇన్‌చార్జిల సహకార ంతో ఓటరు నమోదు సహాయ కేంద్రాలు ఏర్పాటు చేసి పట్టభద్రులందరికీ అవగాహన కల్పిస్తూ ఓటరు నమోదు జరుగుతుందని తెలియజేశారు

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థిగా గోపిమూర్తి నామినేషన్



కాకినాడ/ఏలూరు అర్బన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): తూర్పు- పశ్చిమగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజకవర్గ ఎన్నికలకు సంబంధించి రెండో రోజు మంగళవారం భీమవరానికి చెందిన బొర్రా గోపిమూర్తి కాకినాడ కలెక్టరేట్‌లో నామినేషన్ దాఖలు చేశారు. ఆయన తూర్పు- పశ్చిమగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ షాన్‌మోహన్‌కి నామినేషన్ పత్రాలు సమర్పించారు. అనంతరం ధర్నాచౌక్ రోడ్‌లో భారీ బహిరంగ సభ నిర్వహించారు. పీడీఎఫ్ టీచర్ ఎమ్మెల్సీ అభ్యర్థి గోపిమూర్తి మాట్లాడుతూ ఎమ్మెల్సీగా నన్ను గెలిపించిన వెంటనే షేక్‌సాబ్జీ ఆశయాలను సాధించడానికి నిరంతరం పని చేస్తానన్నారు. సభకు యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించారు. కృష్ణ, గుంటూరు పీడీఎఫ్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ లక్ష్మణరావు, ఎమ్మెల్సీ వెంకటేశ్వరరావు, ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఉదయబ్రహ్మం పాల్గొన్నారు.

బంగారం.. మతలబు!

- వ్యాపారుల వద్దకు దోచిన, నకిలీ బంగారం
- తాకట్లు పెడుతున్న దొంగలు
- పోలీసు కేసుల్లో ఇరుక్కుంటున్న వ్యాపారులు

భీమవరం క్రైం, నవంబరు 12(ఆంధ్రజ్యోతి):అతివల అందానికి వస్త్రాలతోపాటు బంగారు ఆభరణాలు కూడా ఒక ప్రధాన పాత్ర పోషిస్తాయి. ప్రతి మహిళ బంగారానికి ఎంతో ప్రాధాన్యం ఇస్తుంటారు. వేడుకల్లో ఎవరు ఎక్కువ బంగారు ఆభరణాలు ధరిస్తే వారు ఉన్నతమైన స్థితిలో ఉన్నట్లు నిర్ధారిస్తారు. కానీ ఇటీవల బంగారం ధర రోజురోజుకు పెరుగుతూ రావడంతో దాన్ని ధరించడం కంటే చోరీలు జరుగుతాయేమో అన్న భయం అందరిలోనూ నెలకొన్నది. ఇటీవల జిల్లాలో బంగారం దొంగతనం కేసులు పెరిగాయి. దీంతో బంగారం కొనాలంటేనే చాలా మంది భయపడుతున్నారు. బంగారాన్ని ధరించి వేడుకలకు వెళ్ళాలంటే ఆందోళన చెందే పరిస్థితి నెలకొన్నది. మరో పక్క ఇళ్ళలో భద్రపరిచినా కూడా ఏం జరుగుతుందో అన్న ఆవేదన అందరిలోను మెదులుతున్నది. ఇదంతా ఒక ఎత్తు అయితే ముఖ్యంగా బంగారు వ్యాపారులు కూడా ఎప్పుడు ఏం జరుగుతుందో అన్న ఆందోళనలో ఉంటున్నారు. జిల్లాలో నర్సాపురం, భీమవరం, తాడేపల్లిగూడెం, తణుకు, పాలకొల్లు వంటి పట్టణాల్లో సుమారు 800 వరకు బంగారు దుకాణాలు ఉన్నాయి. అయితే కొంత మంది మర్యాదస్తులుగా వచ్చి బంగారు ఆభరణాలు విక్రయించడం, మరికొందరు ఖాతాదారులు వెంటపెట్టుకుని వచ్చి బంగారం విక్రయించడంతో వ్యాపారస్తులు వాటిని కొనుగోలు చేస్తున్నారు. తరువాత వారు పోలీసులకు పట్టుబడితే పోసుల విచారణలో ఏ దుకాణాల్లో విక్రయించారో చూపించమనడంతో కొనుగోలు చేసిన వ్యాపారులు ఒకటికి మూడింతలు రికవరీ రూపేణా బంగారు వస్తువులు తిరిగి ఇవ్వవలసిన పరిస్థితి నెలకొంటుంది. మరో పక్క బాగా నమ్మిన ఖాతాదారులు కూడా నకిలీ బంగారు వస్తువులు తీసుకువచ్చి తాకట్టు పెడుతూ ఉండటంతో చివరకు వ్యాపారులు భారీగా నష్టపోతున్నారు. ఒక పక్క రికవరీల రూపంలో చెల్లింపులు మరో పక్క నకిలీ బంగారు వస్తువులు తాకట్టులతో తలలు పట్టుకునే పరిస్థితి ఏర్పడుతున్నది.

తాకట్టుకు ఆఫర్లు

ఇటీవల కొన్ని ప్రైవేటు తాకట్టు కంపెనీలు పుట్టగొడుగుల్లా వ్యాపించాయి. మా వద్ద బంగారం తాకట్టు పెట్టండి ఒక గ్రాముకు అధికంగా డబ్బు వడ్డీలకు ఇస్తామంటూ ప్రచారాలు, మరికొన్ని కంపెనీలు మీరు ఎక్కడైనా బంగారు వస్తువులు తాకట్టు పెడితే అవి విడిపించి మేమే కొనుగోలు చేస్తాం అంటూ ప్రచారాలు చెయ్యడంతో కొందరు దొంగలకు ఇదో అవకాశంగా మారుతున్నది. కొట్టేసిన బంగారు ఆభరణాలను కొన్ని ప్రైవేటు కంపెనీల్లో తాకట్టు పెట్టి కొన్నాళ్ళకు అవి విడిపించి కొనేవారికి విక్రయాలు చేసి సొమ్ము చేసుకుంటున్నారు.



మోసాలు చేస్తున్నదిలా..

- నరసాపురం పట్టణంలో ఒక వ్యాపారికి ఒక మహిళ దఫదఫాలుగా బంగారం తాకట్టు పెట్టి సుమారు రూ.60 లక్షలు వరకు తీసుకున్నది. మళ్ళీ ఆ మహిళ బంగారు వస్తువులు తీసుకురాగా ఆ వ్యాపారి స్నేహితుడు పరిశీలించి బంగారు వస్తువులు కాదని చెప్పడంతో ముందుగా పెట్టిన వస్తువులు కూడా పరిశీలించగా అవి కూడా నకిలీ వస్తువులుగా తేలింది.
- భీమవరం పట్టణంలో ఒక వ్యాపారి రెండు సంవత్సరాలు క్రితం ఒక మహిళకు చెందిన సుమారు 8 కాసుల బంగారు వస్తువులు తాకట్టు పెట్టుకున్నాడు. ఈ మహిళ రెండు సంవత్సరాలైనా విడిపించకపోవడం, వడ్డీ కూడా చెల్లించకపోవడంతో ఆవ్యాపారి వస్తువులను తనిఖీ చెయ్యగా నకిలీవని తేలింది. దీంతో మహిళకు ఫోన్ చెయ్యగా ఫోన్‌కు స్పందించ లేదు. ఆ మహిళ అడ్రస్ కూడా దొరకలేదు.
- తాడేపల్లిగూడెంకు చెందిన ఒక వ్యాపారి బాగా తెలుసున్న ఖాతాదారుని స్నేహితుని వద్ద సుమారు 2 కాసులు బంగారు వస్తువులు కొనుగోలు చేశాడు. అయితే కొద్ది రోజులు తరువాత ఆ వ్యక్తిని తీసుకుని పోలీసులు వచ్చారు. 8కాసులు అమ్మినట్టు చెప్పాడని రికవరీ చేసుకొని వెళ్ళారు. దీంతో ఆ వ్యాపారి ఖంగుతిన్నాడు.
- ఇటీవల ఆకివీడు పట్టణానికి చెందిన ఇద్దరు వ్యక్తులు 400 గ్రాములు బంగారాన్ని దొంగిలించి ఆ బంగారాన్ని ఒక ప్రముఖ కంపెనీలో తాకట్టు పెట్టారు. కొద్ది రోజులు తరువాత ఆ బంగారాన్ని విడిపించి ఒక ప్రముఖ కంపెనీలోని అసిస్టెంట్ మేనేజర్‌కు విక్రయించి సొమ్ము చేసుకున్నారు. ఆ ఇద్దరు దొంగలతో పాటు కంపెనీ అసిస్టెంట్ మేనేజర్ కూడా పోలీసులు అరెస్టు చేశారు.
- పాలకోడేరు మండలానికి చెందిన ఒక ప్రముఖ పార్టీ నేత ఇంట్లో పనిమనిషిగా చేస్తున్న ఒక మహిళ కొద్ది రోజుల క్రితం బంగారు ఆభరణాలు చోరీ చేసి భీమవరం పట్టణంలో ఒక వ్యాపారి వద్ద తాకట్టు పెట్టింది. ఆ మహిళ పోలీసులు విచారణలో పట్టుబడటంతో ఆ వ్యాపారి ఆభరణాలు తిరిగి ఇచ్చేసి చేతులు కాల్చుకునే పరిస్థితి ఏర్పడింది.

వ్యాపారులు జాగ్రత్తలు పాటించాలి

ఆర్‌జీ జయసూర్య (భీమవరం డీఎస్పీ)



బంగారు వ్యాపారులు కొత్తవారి పట్ల, అపరిచితుల పట్ల జాగ్రత్తలు పాటించాలి. ఏదో లాభం కోసం ఆశపడి చాలా వరకు నష్టపోతున్నారు. అలాగే తాకట్టు పెట్టుకునే వారి వద్ద కూడా ఆధార్‌కార్డు, అడ్రస్ వివరాలు తీసుకుని తాకట్టు పెట్టుకోవాలి. ఇలా చాలా మంది మోసపోతున్నారు. బంగారం ధరలు భారీగా పెరిగిపోవడంతో దొంగతనాలు పెరిగాయి. దొంగలు ఇటీవల తెలివితేటలు ఉపయోగించి దొంగిలించిన బంగారాన్ని తాకట్టు పెడుతున్నారు. అది కూడా ప్రైవేటు కంపెనీల్లో ఎక్కువ పెడుతున్నారు. తరువాత వాటినే మరో ప్రైవేటు కంపెనీలకు విక్రయిస్తున్నారు. అలాంటి కేసులు భారీగా పెరిగాయి. దీనిపై వ్యాపారులకు అవగాహన కల్పిస్తాం.

గ్రామాల్లో ట్రైనీ ఆఫీసర్ల పర్యటన



కాళ్ళ మండలంలో పర్యటిస్తున్న ట్రైనీ అధికారులు

కాళ్ళ/ఉండి/, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : కాళ్ళ మండలం ప్రాతాళ్ళమెరక గ్రామంలో మంగళవారం ట్రైనీ ఆఫీసర్ల బృందం పర్యటించారు. ముస్సోరిలోని లాల్ బహదూర్ శాస్త్రీ నేషనల్ అకాడమి నుంచి వచ్చిన కాత్యాయని సింగ్ ఐఎఫ్ఎస్, శ్రీకృష్ణశ్రీరామ్ సుషీర్ ఐఏఎస్, లక్ష్మణ్ ఆనంద్ ఐఎఫ్ఎస్, భగత్‌శ్యామల్ కళ్యాణరావ్ ఐఏఎస్, రూపాలి సురాణా ఐఆర్ఎస్ (ఐటీ)లు ఫీల్డ్ స్టడీ కార్యక్రమంలో భాగంగా ప్రాతాళ్లమెరక గ్రామంలో క్షేత్రస్థాయిలో పర్యటించారు. ఒకే ఆవరణలో కట్టిన సచివాలయం భవనాలను పరిశీలించారు. అనంతరం గ్రామంలో మంచినీటి చెరువు, రక్షిత మంచినీటి సరఫరా కేంద్రం, అంగన్‌వాడీ కేంద్రం, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను పరిశీలించారు. గ్రామస్తులతో మాట్లాడి వారి జీవన శైలిని అడిగి తెలుసుకున్నారు. పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రంలోని విద్యార్థులతో మాట్లాడి ముచ్చటించారు.

- శిక్షణ కార్యక్రమంలో భాగంగా ట్రైనీ అధికారుల బృందం ఉండి మండలం మహదేవపట్నంలో పర్యటించారు. జడ్పీహైస్కూల్‌లో 10వతరగతి విద్యార్థులతో కొద్దిసేపు మమేకమయ్యారు. మీవిద్య పూర్తయిన తరువాత ఎంతమంది ఐఏఎస్, ఐపీఎస్‌లకు వెళ్తారు అని ప్రశ్నించగా పలువురు తమ ఆసక్తిని తెలిపారు. గ్రామంలో మంచినీటి చెరువును, పొలాలను పరిశీలించారు.
- ట్రైనీ అధికారుల బృందం మంగళవారం కలెక్టరేట్‌లో జేసీ టి.రాహుల్ కుమార్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలుసుకున్నా రు. ఈ సందర్భంగా జిల్లా నైసర్గిక స్వరూపం, విస్తీర్ణం, మండలాలు, జనాభా, ప్రధాన పంటల సాగు, వివిధ శాఖలలో అమలు జరుగుతున్న సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను జేసీ తెలియజేశారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఏలూరు క్రైం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో ఖాళీగా ఉన్న సెకండ్ క్లాస్ స్పెషల్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.పురుషోత్తమకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. 9 పోస్టులు ఖాళీగా ఉన్నాయ న్నారు. ఏలూరు -2, కొవ్వూరు -2, తణుకు, తాడేపల్లి గూడెం, నర్సాపురం, పాలకొల్లు, జంగారెడ్డిగూడాలలో ఒకొక్క పోస్టు ఖాళీగా ఉన్నాయన్నారు. తాత్కాలిక పద్ధతిపై ఈ పోస్టులు భర్తీ చేయడం జరుగుతు ందన్నారు. నవంబర్ 25వ తేదీ సాయంత్రం 5 గంటల వరకూ దరఖాస్తులను స్వీకరిస్తామన్నారు. పూర్తి వివరా లు జిల్లా కోర్టు నోటీసు బోర్డులోనూ, ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ కోర్టు వెబ్‌సైట్‌లో ఉంటాయన్నారు.

క్రైమ్ కార్నర్

ఉరి వేసుకుని ట్రాక్టర్ డ్రైవర్ అనుమానాస్పద మృతి

పాలకోడేరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): పెన్నాడకు చెందిన ట్రాక్టర్ డ్రైవర్ అరుగుల కృష్ణ (46) ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడని పాలకోడేరు ఏఎస్‌ఐ ఐవీఎస్ఎస్ఎన్ మోహనరావు తెలిపారు. ఇతని భార్య 20 సంవత్సరాల క్రితం మృతి చెందిందన్నారు. కృష్ణ తన ఇద్దరు కుమారులతో కలసి ట్రాక్టర్ పనిచేసుకుంటూ జీవిస్తూ ఉంటాడని తెలిపారు. కొంత కాలం క్రితం పెద్ద కుమారుడుకి వివాహమైంది. ఈనెల 5వ తేదీన బయటకు వెళ్ళిన కృష్ణ ఇంటికి తిరిగి రాలేదు. పెన్నాడపాలెంలోని బ్రాందీషాపు దగ్గరలో ఉన్న పాకలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడని తెలిపారు. ఇతను మృతి చెంది మూడు, నాలుగు రోజులై ఉండవచ్చునని పోలీసులు, స్థానికులు చెబుతున్నారు. దీనిపై కుమారుడు పవన్ కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు.

మహిళా పోలీసు మెడలో గొలుసు చోరీ

జంగారెడ్డిగూడెం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఓ సచివాలయ ంలో మహిళా పోలీసుగా పని చేస్తున్న తగరం ఎస్తేరు రాణి ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద నివాసముంటున్నారు. మంగళవారం రాత్రి ఆమె తన ఇంటి నుంచి త్రివేణి రోడ్డు మీదుగా ఉప్పలమెట్ట ఏరియాకు స్కూటీ డ్రైవ్ చేసుకుంటూ వెళ్తున్నారు. ఆమె వెనుక పల్సర్ ద్వి చక్ర వాహనంపై ఒక యువకుడు ఫాలో అయ్యాడు. త్రివేణి కళాశాల రోడ్డుకు వచ్చే సరికి చీకటిగా ఉండడంతో ఆమె మెడలో ఉన్న ఐదు కాసుల పుస్తెల తాడును లాక్కుని పారిపోయాడు. ఈ ఘటనలో ఎస్తేరు రాణి కింద పడిపోగా ఆమెకు స్వల్ప గాయాలయ్యాయి. డీఎస్పీ యు.రవిచంద్ర, సీఐ కృష్ణ బాబు, ఎస్సై జబీర్ సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు.

ద్విచక్ర వాహనాల దొంగ అరెస్టు

23 వాహనాలు స్వాధీనం



దొంగను అరెస్టు చేసి వివరాలు చెబుతున్న డీఎస్పీ రవిచంద్ర

జంగారెడ్డిగూడెం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): జల్సాలకు అలవాటు పడి ద్విచక్ర వాహనాలను దొంగిలించి అమ్ముకునే తూర్పు గోదావరి జిల్లా గోపాలపురం మండలం కరిచర్లగూడెం గ్రామానికి చెందిన పల్లంటి శ్రీనివాస్ అలియాస్ శ్రీనును అరెస్టు చేసి అతని నుంచి రూ.పది లక్షల విలువ చేసే 23 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ యు.రవిచంద్ర తెలిపారు. మంగళవారం స్థానిక పోలీసు స్టేషన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలను వెల్లడించారు. ప్రస్తుతం పట్టణంలోని రామచంద్రాపురంలో నివసిస్తున్న పల్లంటి శ్రీనివాస్ పలు ప్రాంతాల్లో 23 ద్విచక్ర వాహనాలను దొంగిలించి పట్టణ శివారు బైనేరు వంతెన సమీపంలో పొదల్లో దాచాడు. వీటిని పోలీసులు స్వాధీన పరుచుకున్నారు. ఇతను పాత నేరస్తుడని, ఇతనిపై సత్తుపల్లిలో కూడా కేసులున్నాయని, నేరాలు చేసి జైలుకు కూడా వెళ్ళి వచ్చాడన్నారు. అతని పాత నేర చరిత్రను దృష్టిలో పెట్టుకుని అతన్ని అదుపులోకి తీసుకుని విచారించి వివరాలు రాబట్టినట్లు తెలిపారు. సమావేశంలో సీఐ కృష్ణబాబు, ఎస్సై ఎస్‌కె. జబీర్, ఏఎస్సైలు ఎన్‌వి.సంపత్ కుమార్, ఎన్.రాజేంద్ర ప్రసాద్, పీసీ రాజశేఖర్ పాల్గొన్నారు.



దొంగలను అరెస్టు చేసి విలేకర్లతో మాట్లాడుతున్న సీఐ జి.దుర్గాప్రసాద్

ముగ్గురు దొంగల అరెస్టు

రూ.1.48 లక్షల విలువైన బంగారం స్వాధీనం

నరసాపురం రూరల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ముగ్గురు దొంగల్ని అరెస్టు చేసినట్లు రూరల్ సీఐ జి. దుర్గాప్రసాద్ చెప్పారు మంగళవారం రూరల్ స్టేషన్‌లో ఎస్సై వెంకట సురేష్‌తో కలిసి విలేకర్లతో మాట్లాడారు. ఈనెల 8న రాత్రి చిట్టవరం గ్రామంలో కుడిపూడి నాగలక్ష్మి నివాసంలో దొంగతనం జరిగిందన్నారు. మరుసటి రోజు ఆమె ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు. దర్యాప్తులో భాగంగా గ్రామంలో మంగళవారం అనుమానాస్పదంగా తిరుగుతున్న రాజోలు మండలం మలికిపురంకు చెందిన గొమ్మేటి గోపినాధ్, పాలకొల్లు మండలం దిగమర్రుకు చెందిన వీరవల్లి పవన్ కుమార్, చిట్టవరం గ్రామానికి చెందిన కోళ్ల సుజాతలను అదుపులోకి తీసుకుని విచారించగా వీరి వద్ద నుంచి రూ.1.48లక్షల విలువల చేసే 50.74 గ్రాముల బంగారం, రూ.3190 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. వీరిని కోర్టుకు హాజరుపర్చాగా రిమాండ్ విధించినట్లు సీఐ చెప్పారు.

దొంగ అరెస్టు

అత్తిలి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : అత్తిలి పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక కేసులో నిందితుడైన ఖండవల్లి సీతారాముడును సోమవారం రాత్రి అదుపులోకి తీసుకుని అతని వద్ద నుంచి ఐదున్నర కాసుల బంగారం, 275 గ్రాముల వెండిన రికవరీ చేసినట్లు ఎస్‌ఐ పి ప్రేమరాజు తెలిపారు. నిందితుడిని రిమాండ్ నిమిత్తం తణుకు కోర్టులో హాజరు పరిచినట్లు తెలిపారు.

రూ.20 వేలు పంపించి రూ.46 లక్షలు కొట్టేశారు..!

ఏలూరు క్రైం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరగాళ్ల వలలో చిక్కి ఒక వ్యక్తి 46 లక్షల 30 వేల రూపాయలు పోగొట్టుకున్నాడు. అశోక్‌నగర్‌కు చెందిన కె.శేషగిరి ప్రసాద్‌కు ఈ నెల 8వ తేదీన ఒక గుర్తు తెలియని వ్యక్తి ఆయన అకౌంట్‌కు 20 వేల రూపాయలను పంపించారు. పొరపాటున వచ్చాయని తిరిగి వాటిని వేయాలని ప్రాధేయపడి అడిగాడు. ఆ మాటలు నమ్మిన శేషగిరి ప్రసాద్ తిరిగి ఆన్‌లైన్ ద్వారా పంపించారు. ఈ నెల 10న తన అకౌంట్‌ను పరిశీలించగా 46 లక్షల 30 వేల రూపాయలను సైబర్ నేరగాళ్లు అపహరించారని గుర్తించారు. ఏలూరు టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో టూటౌన్ సీఐ వైవి రమణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సైబర్ నేరగాళ్ల విషయంలో అప్రమత్తంగా ఉండాలని పోలీసులు హెచ్చరిస్తున్నారు.

పోలీసుల అదుపులో వైసీపీ సోషల్ మీడియా యాక్టివిస్టులు

ఏలూరు క్రైం, నవంబరు 12(ఆంధ్రజ్యోతి):ఏలూరు జిల్లాకు చెందిన జనసేన నాయకుడు ఇచ్చిన ఫిర్యాదుతో ఏలూరు వన్‌టౌన్ పోలీసులు, రూరల్ పోలీసులు కొంత మంది వైసీపీ సోషల్ మీడియా యాక్టివిస్టులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం. విశాఖపట్నానికి చెందిన ఒక మహిళను కూడా వన్‌టౌన్ పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. ఆమెను అరెస్టు చేయడానికి రంగం సిద్ధం చేశారు. అయితే ఈ విషయాలను అధికారులు గోప్యంగా ఉంచుతున్నారు.

రైలు పట్టాలపై గుర్తు తెలియని మృతదేహం



ఏలూరు క్రైం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) :ఏలూరు రైల్వే స్టేషన్ పరిధిలోని వట్లూరు రైల్వేస్టేషన్ దగ్గర సుమారు 20 నుంచి 25 సంవత్సరాలు కల్గిన ఒక యువకుడు మృతి చెంది ఉన్నాడు. ఇతడిని గరీబ్‌రథ్ ఎక్స్‌ప్రెస్ రైలు ఢీ కొంది. అతను సుమారు 5.7 అడుగులు ఎత్తు కల్గి, తెలుపు రంగు శరీరం, నలుపురంగు పొడవు చేతుల టీషర్టు, గోధుమ రంగు షార్టు ధరించి ఉన్నాడు. అనుమానాస్పద మృతిగా నమోదు చేసి మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుని వివరాలు తెలిసిన వారు ఏలూరు రైల్వే ఎస్‌ఐ సైమన్ సెల్ నెంబర్ 9989219559కు సమాచారం అందించాలని రైల్వే పోలీసులు కోరారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

ఏలూరు క్రైం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : ఏ కారణమో తెలియదు కాని పురుగు మందు తాగి యువకుడు తీవ్ర అస్వస్థతకు గురై ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. చాట్రాయి మండలం కోటపాడు గ్రామానికి చెందిన పర్సా భరత్‌కుమార్ (18) ఈనెల 11వ తేదీన పురుగు మందుతాగి తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. చింతలపూడి ప్రభుత్వాసుపత్రికి ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తీసుకువచ్చారు. మంగళవారం ఉదయం మృతి చెందాడు.

అత్యాచారం చేశాడంటూ బాలిక ఫిర్యాదు

బుట్టాయగూడెం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మెరకగూడెంకు చెందిన వ్యక్తి తనపై అత్యాచారం చేశాడని మండలంలోని ఒక గ్రామానికి చెందిన గిరిజన బాలిక మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ప్రేమిస్తున్నానంటూ వెంటబడి పెళ్ళి చేసుకుంటానని గర్భవతిని చేసి మోసం చేశాడని ఫిర్యాదులో పేర్కొంది. ఎస్సై దుర్గా మహేశ్వరావు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.



అవార్డులు అందుకున్న శాస్త్రవేత్తలను అభినందిస్తున్న ఉపకులపతి, సిబ్బంది

ఉద్యాన వర్సిటీకి అవార్డులు

తాడేపల్లిగూడెం రూరల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): వెంకట్రామన్నగూడెం డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన వర్సిటీకి అవార్డుల పంట పండింది. ఇటీవల బెంగళూరులో నిర్వహించిన ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ ఇన్ ప్లాంట్ ప్రొటెక్షన్ ఇన్ హార్టీకల్చర్‌లో ఉత్తమ జీవ సంబంధమైన పరిశోధనకు గాను అంబాజీపేట ఉద్యాన పరిశోధనా కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ చలపతిరావుకు అవార్డు లభించింది. అలాగే డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన వర్సిటీ సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ టి. నాగలక్ష్మికి ఉద్యాన పంటల్లో తెగుళ్ల నియంత్రణలో ఉత్తమ కృషికి గాను ఫెలోషిప్ ప్రదానం చేశారు. అవార్డులు పొందిన శాస్త్రవేత్తలను విశ్వవిద్యాలయ ఉపకులపతి డాక్టర్ బి.గోపాల్, రిజిస్ట్రార్ బి. శ్రీనివాసులు, సిబ్బంది అభినందించారు.



వాలీబాల్ పోటీలను ప్రారంభిస్తున్న టీబీఆర్ చైర్మన్ భోగేశ్వరరావు

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి

పెంటపాడు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని టీబీఆర్ సంస్థ అధినేత తనుబుద్ది భోగేశ్వరరావు అన్నారు. బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని అలంపురం టీబీఆర్ సైనిక్ స్కూల్‌లో మంగళవారం ఆయన ఆటల పోటీలను ప్రారంభించి మాట్లాడుతూ ఏకాగ్రత ఉంటే లక్ష్యాలను సాధించవచ్చన్నారు. కరస్పాండెంట్ పద్మావతి, డైరెక్టర్ రవికిరణ్, హెచ్ఎం కల్యాణి, ఏవో నాగరాజు పాల్గొన్నారు.

ఫ్రైడే డ్రైడే విధిగా పాటించాలి

ఇరగవరం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): రోగులతో సిబ్బంది వైఖరి బాగుండాలని డీఎంహెచ్‌వో డాక్టర్ డి. మహేశ్వరరావు అన్నారు. తణుకు అర్బన్ హెల్త్ సెంటర్‌ను మంగళవారం ఆయన సందర్శించారు. రికార్డులను పరిశీలించి మాట్లాడుతూ చలిగాలులు ప్రారంభమైన నేపథ్యంలో జలుబు, జ్వర పీడితుల సంఖ్య ఎక్కువగా ఉందని ఫ్రైడే డ్రైడే విధిగా పాటించాలన్నారు. జిల్లా మలేరియా అధికారి డాక్టర్ ఎం.గులాబ్ రాజ్‌కుమార్, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కె. పృథ్వీరాజ్ తదితరులు పాల్గొన్నారు.

రేపు ట్రస్టు ఆసుపత్రికి వైద్యులు

పెంటపాడు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): అలంపురం ట్రస్టు ఆసుపత్రికి ఈనెల 14న రాజానగరం జీఎస్ఎల్ ఆసుపత్రి నుంచి వైద్య నిపుణులు వస్తున్నట్టు ట్రస్టు చైర్మన్ కొలనువాడ పెదకృష్ణంరాజు తెలిపారు. జనరల్ మెడిసిన్, కేన్సర్, స్త్రీలు, చిన్నపిల్లలు తదితర వాటికి చికిత్స అందజేస్తారన్నారు. అన్ని రకాల రక్త పరీక్షలతో పాటు ఈసీజీ, టూడీ ఎకో, అల్ట్రాసౌండ్ పరీక్షలు చేస్తారన్నారు .

విద్యారంగ పరిరక్షణకు పోరాటం చేయాలి

పాలకొల్లు అర్బన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): విద్యారంగ పరిరక్షణకు సమరశీల పోరాటాలు చేయడానికి సన్నద్ధంగా ఉండాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.శివారెడ్డి అన్నారు. స్థానిక లయన్స్ క్లబ్‌లో మంగళవారం ఏఐఎస్ఎఫ్ జిల్లా మహాసభ నిర్వహించారు. తొలుత గాంధీ బొమ్మల సెంటర్ నుంచి లయన్స్ క్లబ్ వరకు ర్యాలీ నిర్వహించారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవికుమార్, జిల్లా కార్యదర్శి సికిలే, పుష్పకుమారి, పూర్వ అధ్యక్షులు క్రాంతి పాల్గొన్నారు.



స్నేహితుడి కుటుంబానికి పూర్వ విద్యార్థుల సాయం

పాలకొల్లు అర్బన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంఎంకేఎస్ఎం హైస్కూల్లో 1989-94 మధ్య చదివిన విద్యార్థులు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న స్నేహితుడి కుటుంబానికి లక్ష రూపాయలు ఆర్థిక సాయం అందించారు. తమతో చదివిన రుద్ర సుబ్రహ్మణ్యం ఇటీవల క్యాన్సర్‌తో మరణించడంతో ఆ కుటుంబం కోసం తోటి సహచరులతో విరాళాలు సేకరించి సుబ్రహ్మణం కుమార్తె పేరుతో బ్యాంక్‌లో డిపాజిట్ చేసి, పత్రాలను అందించారు. పూర్వ విద్యార్థుల సంఘ నాయకులు పోలిశెట్టి శ్రీశ్రీ ఉన్నారు.

కట్నం వేధింపులపై కేసు

భీమవరం క్రైం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : తన భర్త, అత్తమామలు, ఆడపడుచులు అదనపు కట్నం కోసం వేధిస్తున్నారని భీమవరం మండలం దిరుసుమర్రు గ్రామానికి చెందిన చెల్లబోయిన గంగాభవాని మంగళవారం రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. తుందుర్రుకు చెందిన బాలాజీతో 2023లో వివాహమైంది. వివాహ సమయంలో రూ.2.60 లక్షలు కట్నంగా ఇచ్చారు. ఆమె తండ్రి వెళ్ళి మాట్లాడగా అతడిపై దాడి చేశారు. దీనిపై ఆమె ఫిర్యాదు మేరకు భర్త బాలాజీ, అత్త, మామ, ఇద్దరు ఆడపడుచులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వీర్రాజు తెలిపారు.

ఆక్వా సాగు నిలుపుదల



దుంపగడపలో ఆక్వా చెరువు నుంచి బయటకు తోడుతున్న నీరు

దుంపగడపలో ఆక్వా చెరువు నుంచి నీటిని తోడిస్తున్న అధికారులు

ఆకివీడు రూరల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : సీఎండీ ఆదేశాల మేరకు ఆకివీడు మండలం దుంపగడప గ్రామంలో ఆక్వా చెరువులోని నీరు పంట కాల్వలోకి పోలీసుల సహకారంతో తోడించారు. 2020 నుంచి ఆక్వాచెరువు నీటిని నేరుగా మంచినీటి చెరువుకు, వ్యవసాయానికి వెళ్ళే పంట కాల్వలోకి సదరు నిర్వాహకుడు వదిలేస్తున్నారని, పంట కాల్వ గట్టే చెరువు గట్టుగా ఉందని దీని వల్ల తమ పంటలు పాడవుతున్నాయని, మంచినీటి చెరువు నీరు పాడవుతుందని గ్రామానికి చెందిన సూరంపూడి రాంబాబు అనే రైతు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు అక్టోబరు 14వ తేదీన సీఎండీకి ఫిర్యాదు చేయడంతో అధికారులు మంగళవారం మోటారు సాయంతో చెరువులో నీటిని పంట కాల్వలోకి తోడించారు. గ్రామానికి సురక్షితమైన మంచినీరు అందించేందుకు పంట కాల్వ వెంబడి ఆకివీడులో ఉన్న అక్రమ నివాసాలను ఇటీవల తొలగించారు. ఆక్వా చెరువుకు ప్రత్యేకంగా గట్టు లేనందున నీరు బయటకు వెళ్లే మార్గం లేకపోవడంతో మంచినీరు కలుషితం అవుతోందని, పంటలు పాడుతున్నాయని సీఎండీ ఆదేశాల మేరకు చెరువు సాగును నిలుపుదల చేసి, చెరువును అరగట్టేందుకు చర్యలు తీసుకుంటున్నామని అధికారులు తెలిపారు. మత్స్యశాఖ అధికారులు, పోలీసు సిబ్బంది, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



భీమవరం సమావేశంలో ఐక్యత చాటుతున్న బీసీ నాయకులు

రాష్ట్రంలో సమగ్ర కులగణన జరపాలి : గూడూరి

భీమవరంటౌన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో సమగ్ర కులగణన జరపాలని, బీసీలకు చట్ట సభలలో రిజర్వేషన్లు కల్పించాలని జాతీయ బీసీ ప్రజా సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు గూడూరి వెంకటేశ్వరరావు అన్నారు. మంగళవారం భీమవరంలో జరిగిన ఆలిండియా బీసీ ప్రజా వెల్ఫేర్ అసోసియేషన్ సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలో ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని, విద్యా, ఉద్యోగ రంగాలలో 50 శాతం రిజర్వేషన్లు కలిచాలని, స్థానిక సంస్థల రిజర్వేషన్ 50 శాతంకు పెంచాలని డిమాండ్ చేశారు. దేశంలో బీసీ కులాల లెక్కలు లేకపోవడం వలన దేశంలో 60 శాతం పైనే ఉన్నా బీసీ కులాల ప్రజలు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. తొలుత అసోసియేషన్ వర్కింగ్ కమిటీ ప్రెసిడెంట్ నారమామిడి గంగారామ్‌కు నియామక పత్రాన్ని అందించారు. జాతీయ ప్రధాన కార్యదర్శి కూరపాటి కోటంరాజు, జాతీయ ఉపాధ్యక్షుడు చింతాడ శ్రీనివాసరావు, జిల్లా మహిళా విభాగం ప్రెసిడెంట్ సూరిశెట్టి కల్పన, జిల్లా అధ్యక్షుడు కండిబొయిన సుబ్రహ్మణ్యం, రేపూరి గోగురాజు పాల్గొన్నారు.



జూబ్లీ వేడుకల లోగోను ఆవిష్కరించిన కేంద్రమంత్రి శ్రీనివాస వర్మ, తదితరులు

డిసెంబరు 15న యూత్ హాస్టల్స్ సిల్వర్ జూబ్లీ వేడుకలు

భీమవరంటౌన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : యూత్ హాస్టల్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా, భీమవరం యూనిట్ వారి 25వ వార్షికోత్సవం సిల్వర్ జూబ్లీ వేడుకలు డిసెంబరు 15న ఆర్య వైశ్య వర్తక సంఘ భవనంలో నిర్వహిస్తామని అధ్యక్షుడు చిలుకూరి నరసింహరాజు, కార్యదర్శి మట్లపూడి సత్యనారాయణ తెలిపారు. మంగళవారం సంబంధిత వేడుకల లోగోను కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల సహాయమంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ ఆవిష్కరించి మాట్లాడారు. యూత్ ధ్యేయంగా వారు చెడు మార్గాల్లోకి వెళ్లకుండా దేశ నిర్మాణంలోను, యూత్ హాస్టల్స్ ఉద్యమంలోను వారిని భాగస్వామ్యం చేయడం యూత్ హాస్టల్స్ అసోసియేషన్, భీమవరం యూనిట్ ఎంతగానో దోహదపడుతోందన్నారు. మూడువేల మంది సభ్యులు కలిగిన భీమవరం యూనిట్, దక్షిణ భారత దేశంలోనే రెండో అతిపెద్ద యూనిట్‌గా గుర్తింపు తెచ్చుకుందన్నారు. నందమూరి రాజేష్, చెరుకువాడ రంగసాయి, యూనిట్ చైర్మన్ ప్రొఫెసర్ మట్లపూడి సత్యనారాయణ, డాక్టర్ కట్రెడ్డి సత్యనారాయణ, టి.గాంధీ, పి.లక్ష్మణవర్మ, కె.వెంకటరత్నం, బి.పాండురంగారావు, జె. మధుసూదనరావు తదితరులు పాల్గొన్నారు.



ఆర్థిక సాయం అందించిన ఎమ్మెల్యే అంజిబాబు

ఆటో డ్రైవర్ కుటుంబానికి రూ.78 వేలు సాయం

భీమవరంటౌన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడం మానవత్వమని, తోటి మిత్రుడి కుటుంబానికి మేము ఉన్నమంటూ ఆటో యూనియన్ నాయకులు స్పందించి సాయం చేయడం విశేషమని ఎమ్మెల్యే పులపర్తి అంజిబాబు అన్నారు. చైతన్య ఆటో యూనియన్ సభ్యులైన కోరిబిల్లి రవికుమార్ ఇటీవలే మరణించారు. ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో వారి కుటుంబ సభ్యులకు చైతన్య ఆటో ఓనర్స్‌అండ్ వర్కర్స్ సభ్యులు కలిసి రూ.78 వేలు సాయాన్ని ఎమ్మెల్యే చేతుల మీదుగా రెడ్డి సత్తిబాబు ఆధ్వర్యంలో అందించారు. ఆటో యూనియన్ ప్రెసిడెంట్ చెన్నంశెట్టి శ్రీనివాస్, వైస్ ప్రెసిడెంట్ జయకుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్ బొక్కా శ్రీనివాసరావు, కన్వీనర్ బి.కోటేశ్వరరావు, పంతకానీ రఘుపతి, టీడీపీ రాష్ట్ర నాయకులు కోళ్ల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

క్రీడా మైదానాన్ని చెత్తతో పూడ్చడం దుర్మార్గం

ఆకివీడు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : క్రీడా మైదానం అభివృద్ధి పేరుతో చెత్తను ప్రాంగణంలో వేసి పూడ్చడం దుర్మార్గమని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి టి.ప్రసాద్ అన్నారు. జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణాన్ని ప్లాస్టిక్ వ్యర్థాలతో కూడిన చెత్తతో నింపడాన్ని మంగళవారం విద్యార్థులతో కలిసి నిరసన తెలిపారు. తహసీల్దార్ కార్యాలయం, ప్రభుత్వాసుపత్రి ఆవరణలోని చెత్త మొత్తాన్ని పాఠశాల క్రీడా ప్రాంగాణానికి తరలించే ప్రయత్నం చేస్తున్నారన్నారు .విద్యార్థులకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని కల్పించాల్సిన ప్రభుత్వం అనారోగ్యంపాటు చేసే విధంగా చెత్తను పాఠశాల క్రీడా ప్రాంగణంలో డంప్ చేయడం తగదన్నారు. ఇప్పటి వరకు వేసిన చెత్తను తొలగించేలా నగర పంచాయతీ కమిషనర్ చర్యలు చేపట్టాలన్నారు. చర్యలు తీసుకోకపోతే పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఎస్ఎఫ్ఐ నాయకులు హేమంత్, సాయి, ఫణి, వసంత్, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గేదెల ధనుష్, విద్యార్థులు తదితరులు ఉన్నారు.

మందుబాబు హల్‌చల్

భీమవరం క్రైం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని బొంబాయి స్వీట్ సెంటర్‌లో మందుబాబు మంగళవారం రాత్రి హల్‌చల్ చేశారు. మద్యం మత్తులో ఒంటిపై దుస్తులు తీసివేసి చిందులు వేశాడు. మెయిన్ రోడ్డుపై వస్తున్న వాహనాలను ఆపి విధ్వంసం చేశాడు. సుమారు అరగంట సేపు ట్రాఫిక్ నిలిచిపోయింది. స్థానికుల సమాచారంతో పోలీసులు అక్కడకు చేరుకుని అతడికి నచ్చచెప్పి స్టేషన్‌కు తీసుకువెళ్ళారు. ఆవ్యక్తి గతంలో కూడా చాలాసార్లు మద్యం సేవించి ఒకటి, రెండో పట్టణాలలో హల్‌చల్ చేశాడు. పోలీస్‌స్టేషన్‌లకు వెళ్ళి తనపై కేసు నమోదు చేయాలని పోలీసులను విసిగించిన సన్నివేశాలు ఎన్నో ఉన్నాయని అక్కడ ఉన్న వారు చెబుతున్నారు.

పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ తరగతులు

గణపవరం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): గణపవరం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లకు శిక్షణ తరగతులు నిర్వహించారు. రెండు రోజుల పాటు జరిగే ఈ శిక్షణ తరగతుల్లో మొదటి రోజు తాగునీరు, వీధిదీపాలు, డ్రెయినేజీ తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. ఎంపీడీవో బేబి శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

నాయీ బ్రాహ్మణులను ఐకమత్యంగా తీసుకెళ్తా : శివప్రసాద్



జిల్లా నాయీ బ్రాహ్మణసేవా సంఘ సభ్యులు

భీమవరం రూరల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఉన్న నాయీ బ్రాహ్మణ సోదరులందరిని ఐకమత్యంగా ముందుకు తీసుకెళ్తానని, అన్యాయం జరిగితే ముందుండి పోరాడతానని నాయీ బ్రాహ్మణ జిల్లా నూతన అధ్యక్షుడు కొడవర్తి శివప్రసాద్ అన్నారు. కరుకువాడ బేతపూడి గ్రామంలో మంగళవారం నాయీ బ్రాహ్మణ సమావేశంలో జిల్లా నాయీ బ్రాహ్మణసేవా సంఘం నూతన అధ్యక్షుడిగా కొడవర్తి శివప్రసాద్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆయన మాట్లాడుతూ నాయీ బ్రాహ్మణ సోదరులకు ప్రభుత్వ పథకాలు అర్హులందరికీ అందేలా కృషి చేస్తామన్నారు. జిల్లా రిజిస్ట్రార్ లంక వెంకటేశ్వరరావు, నాయీ బ్రాహ్మణ ఉద్యోగస్తుల సంఘ జిల్లా అధ్యక్షుడు ఎంవీ సత్యనారాయణ, జిల్లా బీసీ సంఘం అధ్యక్షుడు వర్తనపల్లి కాశీ, జిల్లా నాయకులు పట్నాల శంకరం, ఉప్పలపు పెద్దిరాజు, పోలవరపు పోతురాజు, చీపురుపల్లి దేవా, పెద్దిరాజు, ఉమ్మడి జిల్లా నాయీ బ్రాహ్మణ నాయకులు పాల్గొన్నారు.



చింతలపాటి మూర్తిరాజు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న సర్వోదయ నాయకులు

విద్యాదాత చింతలపాటి మూర్తిరాజుకు ఘన నివాళి

భీమవరంటౌన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : విద్యాదాత, గాంధేయ వాది, సర్వోదయ నాయకులు చింతలపాటి సీతారామచంద్రవరప్రసాద్ మూర్తిరాజు వర్ధంతి కార్యక్రమాన్ని పలు సంస్థలు ఆధ్వర్యంలో నిర్వహించారు మంగళవారం భీమవరం అడ్డ వంతెన వద్ద మూర్తిరాజు విగ్రహానికి చెరుకువాడ రంగసాయి ఆధ్వర్యంలో నివాళులర్పించారు. అల్లూరి సీతారామరాజు సేవా సమితి అధ్యక్షుడు గాదిరాజు సుబ్బరాజు, కార్యదర్శి చెరుకువాడ సుబ్రహ్మణ్యరాజు, ఆనంద ఫౌండేషన్ చైర్మన్ ఉద్దరాజు కాశీ విశ్వనాథరాజు, ఏఎంసీ మాజీ చైర్మన్ ఏఎస్‌రాజు మాట్లాడుతూ మూర్తిరాజు, కాంతేటి వెంకటరాజు, సంఘ సేవకులు చెరుకువాడ రంగసాయి మూర్తిరాజు సేవలను కొనియాడారు. భూపతిరాజు సత్యనారాయణరాజు, వి.రంగరాజు, రమణరాజు పాల్గొన్నారు.

విద్యుత్ ట్రూఅప్ చార్జీలు విరమించుకోవాలి



ఆకివీడులో ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఎం నేతలు

ఆకివీడు/పెనుగొండ, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : ట్రూఅప్ చార్జీల పేరుతో రూ.17 వేల కోట్లు విద్యుత్ భారాన్ని ప్రజలపై వేయడానికి విరమించుకోవాలని సీపీఎం పట్టణ అధ్యక్షుడు కె.తవిటినాయుడు అన్నారు. మగళవారం ఆకివీడు పద్నాల్గవ వార్డులో ఇంటింటా కార్యక్రమంలో భాగంగా ప్రజాపోరు ర్యాలీ నిర్వహించి మాట్లాడారు. ఎన్నికలకు ముందు చార్జీలు పెంచమని చెప్పి అధికారం చేపట్టిన తరువాత ప్రజలపై భారాలు వేయడం తగదన్నారు. పెంకి అప్పారావు, బొడ్డుపల్లి రాంబాబు, సందక ఉదయకుమారి, బీవీ వర్మ, బత్తిన పార్వతి, డోకల రవితేజ, సందక సూరిబాబు, గోపిశెట్టి రాణి, గేదెల విజయలావణ్య, బాక్కా కళ్యాణి, పంపన కృష్ణవేణి, షేక్ వలీ, కడగల వెంకట రమణ, బంకా రాజు, గేదెల రాము తదితరులు ఉన్నారు. పెనుగొండ మండలం సిద్ధాంతం గ్రామంలో సీపీఎం మండల కార్యదర్శి షేక్ పాదుషా ఆధ్వర్యంలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈనెల 14న తహసీల్దార్ కార్యాలయం వద్ద సీపీఎం ఆధ్వర్యంలో జరిగే ప్రజాపోరు ఆందోళనలో ప్రజలందరూ పాల్గొనాలన్నారు. సిద్ధాంతం గ్రామ శాఖ కార్యదర్శి కప్పల రత్నరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం





భీమవరంలో ప్రత్యేక అలంకారంలో సోమేశ్వర స్వామి.. తణుకు యాగంలో దంపతులు

ఘనంగా అఘోర రుద్రహోమం

ఇరగవరం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : శ్రీ ఉమా రామలింగేశ్వర ట్రస్ట్ ఆధ్వర్యంలో తణుకు సమీపంలో నిర్వహిస్తున్న ఆప్తవాజపేయం మహాయాగంలో భాగంగా 11వ రోజు మంగళవారం అఘోర రుద్రహోమం ఘనంగా నిర్వహించారు. యాగంలో గన్ని శ్రీవెంకటకృష్ణ సుబ్రహ్మణ్యేశ్వరరావు, కేదారేశ్వరి, హనుమంతు రాజనారాయణ, హరిలత, దంపతులు కుంకుమ పూజలు, హోమాలు నిర్వహించారు.

- గణపవరం : పిప్పర శివాలయం ఆవరణలో సత్యనారాయణ వ్రతాలు నిర్వహించారు. ఆధ్యాత్మికవేత్త కొలనువాడ సుబ్బరాజు ఆధ్వర్యంలో వ్రతాలు, పూజా సామగ్రి అన్నసమారాధన ఏర్పాటు చేశారు.
- భీమవరంటౌన్ : కార్తీక మాసం ఏకాదశి పురస్కరించుకుని పంచారామ క్షేత్రమైన గునుపూడిలో సోమేశ్వరస్వామికి లక్ష పత్రి పూజను నిర్వహించారు. స్మార్త పురోహితుడు చెరుకుపల్లి సంతోష్ శర్మ ఆధ్వర్యంలో తాడేపల్లిగూడెంకు చెందిన కొట్టు తాతారావు కుటుంబ సభ్యులచే ఏకాదశ రుద్రాభిషేకాలు నిర్వహించారు.
- నరసాపురం టౌన్/మొగల్తూరు : నరసాపురం పట్టణంలోని రాజగోపాలస్వామి ఆలయంలో సుమారు 500 మంది దంపతులు సత్యనారాయణస్వామి వ్రతాలు నిర్వహించారు. మొగల్తూరులో రామాలయం, రాజగోపాలస్వామి ఆలయాల్లో మంగళవారం రాత్రి దీపోత్సవం నిర్వహించారు.

ఘనంగా ఆర్యవైశ్య సంఘ వన సమారాధన

తాడేపల్లిగూడెం రూరల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): నీలాద్రిపురంలో ఆర్యవైశ్య రూరల్ సంఘ కార్తీక వనసమారాధన మంగళవారం ఘనంగా నిర్వహించారు. సంఘస్తులు కుటుంబాలతో సరదాగా గడిపారు. సంఘ రాష్ట్ర అధ్యక్షుడు సీహెచ్. రామ సత్యనారాయణ ముఖ్యఅతిథిగా మాట్లాడుతూ సంఘ సభ్యులతోపాటు సమాజ శ్రేయస్సుకు పనిచేసే ఆర్యవైశ్యులు కలసికట్టుగా ఉండాలన్నారు. రాష్ట్ర కార్యదర్శి ఎన్. శ్రీనివాసులు, నాయకులు కోనా శ్రీనివాస్ హాజరు కాగా రూరల్ సంఘ అధ్యక్షుడు కుసుమంచి వెంకటేశులు, సభ్యులు కార్యక్రమాలను పర్యవేక్షించారు.

పీఎంపీల వన సమారాధన

ఇరగవరం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : ఇరగవరం మండల పీఎంపీల సంఘ అధ్యక్షుడు ఎ.సత్యనారాయణ అధ్యక్షతన పీఎంపీల కార్తీక వనసమారాధన మంగళవారం ఇరగవరంలో నిర్వహించారు. ఇరగవరం పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ వి. క్రాంతిరెడ్డి, డాక్టర్ మౌనిక క్యాన్సర్‌పై పీఎంపీలకు అవగాహన కల్పించారు. సంఘ జిల్లా అధ్యక్షుడు ఎఆర్‌కె పరమేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి సుబాన్, వైస్ ప్రెసిడెంట్ నాగ ప్రసాద్, కార్యదర్శి రామారావు, సభ్యులు పాల్గొన్నారు.

బాలింతలకు బేబి కిట్స్ అందజేత

ఆచంట, నవంబరు12 (ఆంధ్రజ్యోతి): ఆచంట మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో జవ్వాది జ్యోతిర్మయి, నల్గొండ సుప్రియ, చిల్లే కుమారి అనే ముగ్గురు బాలింతలకు బేబీ కిట్స్, పండ్లు మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో మానవత అధ్యక్షుడు కుక్కల లీలాప్రసాద్, కొల్లేపర వెంకన్నబాబు, నంబూరి అంజిబాబు, తమ్మినీడి సత్యనారాయణ మూర్తి, బాలం రాంబాబు పాల్గొన్నారు.

అగ్ని బాధిత కుటుంబానికి సాయం

పాలకొల్లు రూరల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): యాళ్ళవాని గరువుకు చెందిన మైలే చిట్టిబాబు ఉంటున్న ఇల్లు ఆదివారం రాత్రి ప్రమాదవశాత్తు కాలిపోవడంతో సర్వం కోల్పోయిన చిట్టిబాబు కుటుంబానికి రెవెన్యూశాఖ తరపున రూ.5 వేలు, 50 కిలోల బియ్యాన్ని తహసీల్దార్ యడ్ల దుర్గాకిషోర్ మంగళవారం అందించారు. రెడ్ క్రాస్ సంస్థ తరపున స్టీలు సామగ్రి, టార్పాలిన్, దుప్పట్లు, నూతన వస్త్రాలు అందించారు. దొడ్డా శ్రీనివాసరావు, పాముల రజనీకుమార్, జె.రాంబాబు పాల్గొన్నారు

150 మందికి వైద్య పరీక్షలు

అత్తిలి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : అత్తిలి మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో కొమ్మరలో ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించారు. జిల్లా మానవత హెల్త్ కన్వీనర్ కర్రి నరేంద్రరెడ్డి శిబిరాన్ని ప్రారంభించారు. భీమవరం విష్ణు డెంటల్ ఆస్పత్రి వైద్యుడు చైతన్య ఆధ్వర్యంలో 150 మంది వైద్య సేవలు అందించారు. అత్తిలి మండల చైర్మన్ ఆనాల ఆదినారాయణరావు, శ్రీనివాసరావు, ముదునూరి బాలకృష్ణరాజు పాల్గొన్నారు.

బెల్టు షాపులపై దాడి.. ఇద్దరి అరెస్టు

పెనుమంట్ర/నరసాపురం రూరల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : తణుకు ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో బెల్ట్ షాపులపై మంగళవారం దాడులు చేశారు. పెనుమంట్ర మండలం మాముడూరుకు చెందిన వాసంశెట్టి రాంబాబు అనే వ్యక్తి గ్రామంలో బెల్టు షాపు నిర్వహిస్తున్నాడని అరెస్ట్ చేసి అతడి వద్ద నుంచి ఏడు మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. దాడులలో సబ్ ఇన్‌స్పెక్టర్ బి.లక్ష్మి, ఆర్.మధుబాబు సిబ్బంది పాల్గొన్నారు. నరసాపురం మండలం పసలదీవి గ్రామంలో బెల్ట్ షాపు నిర్వహిస్తున్న ఎం.పుల్లయ్యను ఎక్సైజ్ శాఖ పోలీసులు అరెస్ట్ చేశారు. అతడి వద్ద నుంచి 13 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ రమాదేవి తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది శ్రీనివాసరావు, సురేష్‌రాజు, వైసీ శ్రీనివాసరావు, శ్రీకాంత్, సందీప్ గణేష్ పాల్గొన్నారు.

డిసెంబరు 14న జాతీయ లోక్ అదాలత్

భీమవరం క్రైం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : భీమవరం కోర్టుల ప్రాంగణంలో డిసెంబరు 14న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌ను జయప్రదం చేయాలని భీమవరం మూడో అదనపు జిల్లా జడ్జి మండల న్యాయ సేవా సంస్థ చైర్మన్ ఎంఏ సోమశేఖర్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. లోక్‌అదాలత్‌లో పెండింగ్‌లో ఉన్న అన్ని సివిల్ కేసులు, రాజీ కాదగిన క్రిమినల్, చెక్కు బాకీ కేసులు, మనోవర్తి, గృహహింస కేసులు, యాక్సిడెంట్ తదితర కేసులన్నీ రాజీ చేసుకోవచ్చన్నారు. న్యాయవాదులు, పోలీస్ అధికారులు, కక్షిదారులకు రాజీ ప్రాముఖ్యతను వివరించి జాతీయ లోక్ అదాలత్ పట్ల అవగాహన కల్పించాలన్నారు.



జస్టిస్ బాలకృష్ణను కలిసిన కౌన్సిల్ సభ్యులు

దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించాలి

ఆచంట, నవంబరు12(ఆంధ్రజ్యోతి) : దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించాలని ప్రతిపాదనను ముందుకు తీసుకువెళ్తున్నామని రిటైర్డ్ చీఫ్ జస్టిస్ కేజీ బాలకృష్ణన్‌ను కలిశామని నేషనల్ క్రిస్టియన్ కౌన్సిల్ రాష్ట్ర కార్యదర్శి బి.డేవిడ్‌రాజు తెలిపారు. మంగళవారం ఆచంటలో ఆయన మాట్లాడుతూ ఆంధ్ర, తెలంగాణ రాష్ట్ర ఎస్సీ బీసీ-సీ కేటగిరీల వారు ఎదుర్కొంటున్న వివక్షతను క్రైస్తవుల శాతం తగ్గించడానికి ప్రభుత్వం చేస్తున్న కుట్రలను నేషనల్ క్రిస్టియన్ కౌన్సిల్ సభ్యులకు వివరించామన్నారు. ఢిల్లీలో జస్టిస్ బాలకృష్ణన్‌ను కలిశామని, ఆయనను రాష్ట్రానికి ఆహ్వానించామన్నారు. జస్టిస్ బాలకృష్ణను కలిసిన వారిలో డేవిడ్‌రాజుతోపాటు కౌన్సిల్ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ శ్యామ్‌పాల్, రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ పి. జార్జిముల్లర్, ప్రధాన కార్యదర్శి మనోజ్, జిల్లా అధ్యక్షుడు ఎ.శ్యామ్ బాబు తదితరులు ఉన్నారు.

అవినీతి జరిగితే చర్యలు తప్పవు

పాలకోడేరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : గరగపర్రు పంచాయతీలో అవినీతి జరిగిందని తేలితే చట్టపరమైన చర్యలు తప్పవని భీమవరం డీఎల్‌పీవో సీహెచ్ బాలాజీ తెలిపారు. గరగపర్రు గ్రామ పంచాయతీలో 2019మార్చి నుంచి 2024 మార్చి వరకు గ్రామ పంచాయతీ కార్యదర్శిగా పనిచేసిన రాజేష్‌పై గ్రామ సర్పంచి ముదునూరి రామకృష్ణంరాజు ఫిర్యాదుమేరకు మంగళవారం విచారణ చేపట్టారు. పంచాయతీలో కుళాయి కనెక్షన్‌లు, డంపింగ్ యార్డుకు కేటాయించిన నిధులు, పారిశుధ్య కార్మికుల కాంట్రాక్టర్‌కు చెల్లించవలసిన నిధులు తదితర వాటిపై వచ్చిన అభియోగాలపై విచారణ చేపడుతున్నామన్నారు. రికార్డులను పరిశీలించిన అనంతరం చర్యలు తీసుకుంటామన్నారు. విచారణలో అప్పటి గ్రామ కార్యదర్శి రాజేష్ , ప్రస్తుత కార్యదర్శి లక్ష్మీ ప్రశాంతి తదితరులు ఉన్నారు.

పంట క్షేత్ర దినోత్సవం

నరసాపురం రూరల్, నవంబరు12 (ఆంధ్రజ్యోతి): నవరసపురం గ్రామంలో మంగళవారం వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో ఉండి కేవీకే శాస్త్రవేత్తలతో కలిసి పంట క్షేత్ర దినోత్సవాన్ని నిర్వహించారు. ఏడీఈ డాక్టర్ అనిల్‌కుమారి, మాట్లాడుతూ సార్వా పంటకు అనుకూలమైన 1232 రకం విత్తనాలు వేయడం వల్ల అగ్గి తెగులు, సుడి దోమ, మాగుడి తెగులు తట్టుకుంటుందన్నారు. 40 బస్తాలకు పైగా దిగుబడి సాధించవచ్చన్నారు. రైతులందరూ ఈ విత్తనాలను సాగు చేయాలన్నారు. అనంతరం 25 మంది రైతులకు 15 క్వింటాల వేరుశెనగ విత్తనాలు ఉచితంగా అందించారు. శాస్త్రవేత్తలు సుధారాణి, పి.విజయలక్ష్మి, శ్రీనివాస్, కేవీఈకే కో-ఆర్డినేటర్ డాక్టర్ మల్లికార్జునరావు, ఏఈవో నారాయణ పాల్గొన్నారు.

తాగునీరు అందించండి

పాలకోడేరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : గరగపర్రు గ్రామ పంచాయతీ పరిధిలోని యనమదుర్రు డ్రెయిన్‌కు అవతలివైపు ఉన్న దళిత కాలనీకి తాగునీరు అందించాలంటూ ఆ కాలనీ వాసులు గ్రామ పంచాయతీ కార్యదర్శి లక్ష్మి ప్రశాంతిని మంగళవారం కోరారు. దళితవాడలో నూతనంగా ఏర్పాటు చేసిన పైపులైన్‌లు వేయడం వల్ల పాత పైపులైన్‌లోకి తాగునీరు అందడం లేదని, చాలా ఇబ్బందులు పడుతున్నామని సమస్యను పరిష్కరించాలన్నారు.

పథకాల అమల్లో నిర్లక్ష్యం వద్దు

పాలకొల్లు రూరల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పథకాల అమలుపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు అని డీఆర్‌డీవోం ప్రభాకర్ హెచ్చరించారు. ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం పంచాయతీ సచివాలయ కార్యదర్శుల సమావేశం నిర్వహించారు. పలు ప్రభుత్వ పథకాలు యాప్‌లో నిర్దేశించిన సమాచారాన్ని పూర్తిగా సేకరించడానికి అవసరమైతే సచివాలయ సిబ్బందిని వినియోగించుకోవాలని సూచించారు. ఎంపీడీవో ఎన్ఎన్ ఉమా మహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పొగాకు ఉత్పత్తుల వ్యాధులపై అవగాహన ఉండాలి

పాలకొల్లు రూరల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): పొగాకు ఉత్పత్తుల వల్ల వచ్చే వ్యాధులపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని లంకలకోడేరు పీహెచ్‌సీ డాక్టర్ సీహెచ్ ప్రతాప్‌కుమార్ సూచించారు. పీహెచ్‌సీ పరిధిలోని పూలపల్లి, భగ్గేశ్వరం సచివాలయాల్లో మంగళవారం జరిగిన కార్యక్రమాల్లో ఆయన మాట్లాడారు. పొగాకు ఉత్పత్తులైన చుట్ట, సిగరెట్టు, ఖైనీ, గుట్కా, వంటి వివాడడం వల్ల క్యాన్సర్ వ్యాధి వచ్చే ప్రమాదం ఉందని తెలిపారు. డాక్టర్ ఎం.నవ్య జీవన్, ఆరోగ్య విస్తరణాధికారి గుడాల హరిబాబు, సిబ్బంది ఎలిజబెత్, అమలేశ్వరరావు, కమల, హైస్కూల్ హెచ్ఎం జీటీ వెంకటకుమార్ తదితరులు పాల్గొన్నారు.